# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :75 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: మంగళవారం 20-05-2025 | పేజీలు:4 వెల: 2.00


## బెంగళూరును ముంచెత్తిన కుండపోత వర్షం.. కొట్టుకుపోయిన కార్లు

బెంగళూరు:బెంగళూరులో అర్ధరాత్రి కురిసిన వర్షానికి నగరం అతలాకుతలం అయింది. ప్రధాన రోడ్లన్నీ జలమయం అయ్యాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొన్ని కార్లు ప్రవాహానికి కొట్టుకుపోయాయి.అయితే రోడ్లు జలమయం కావడానికి ప్రజలే కారణమంటూ కర్ణాటక మంత్రి జి.పరమేశ్వర ఆరోపించారు. ప్రజలు కాగితాలు, బాటిళ్లు కాలువల్లో వేయడం వల్ల డ్రైనేజీలు మూసుకుపోతున్నాయని.. దీంతో నీళ్లు వెళ్లే దారి లేక రోడ్లపై నిలిచిపోతున్నాయని పేర్కొన్నారు.సోమవారం ఉదయం 8:30 గంటల నాటికి గత 24 గంటల్లో బెంగళూరు నగరంలో సగటున 105.5 మి.మీ వర్షపాతం నమోదైందని స్థానిక వాతావరణ కేంద్రం తెలిపింది. ఇటీవలి చరిత్రలో మే నెలలో నమోదైన అత్యధిక వర్షపాతం ఇదేనని వాతావరణ శాస్త్రవేత్తలు గుర్తించారు. కర్ణాటక రాష్ట్ర విపత్తు పర్యవేక్షణ విభాగం ప్రకారం.. కెంగేరిలో అత్యధికంగా 132 మి.మీ వర్షపాతం నమోదైంది. బెంగళూరు ఉత్తర ప్రాంతంలోని వడేరహళ్లిలో 131.5 మి.మీ వర్షపాతం.. అనేక ప్రాంతాలలో రాత్రిపూట 100 మి.మీ కంటే ఎక్కువ వర్షపాతం నమోదైంది.

## 'ఇందిర సౌర గిరి జల వికాసం'ప్రారంభించిన సీఎం..



నాగర్‌కర్నూల్: 'ఇందిర సౌర గిరి జల వికాసం' పథకాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. నాగర్‌కర్నూల్ జిల్లా మాచారంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అటవీ హక్కుల చట్టం కింద 6.69 లక్షల ఎకరాలకు పోడుపట్టాలు మంజూరు చేశారు. దీనికోసం రూ.600 కోట్లు ఖర్చుచేయనున్నారు.

వంద రోజుల్లో సోలార్ పంపుసెట్లు..

ఈ మేరకు ఇక 'ఇందిర సౌర గిరి జల వికాసం' పథకంపై లబ్దిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని సీఎం అన్నారు. సోలార్ పంపుసెట్లతోపాటు పొలంలో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకుని అదనపు ఆదాయం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. పరిసర ప్రాంతాల గిరిజనులకు లబ్ధిదారులు పథకంపై అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. అచ్చంపేట నియోజకవరాన్ని దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. నియోజకవర్గంలో రైతులందరికీ సోలార్ పంపుసెట్లను పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సోలార్ విద్యుత్ ద్వారా అదనపు ఆదాయం వచ్చేలా చర్యలు చేపట్టాలని, విద్యుత్ పంపుసెట్ల స్థానంలో సోలార్ పంపుసెట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. సీఎం వంద రోజుల్లో రైతులందరికీ సోలార్ పంపుసెట్ల ఏర్పాటు పూర్తి చేయాలన్నారు. ఇందుకోసం స్పెషల్ ఆఫీసర్ ను నియమించాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు సూచించారు.ఐటీడీఏ పరిధిలోని జరిగిన కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అటవీ హక్కుల చట్టం 6.69 లక్షల ఎకరాలకుగానూ మొత్తం 2.30 లక్షల మంది ఎస్టీ రైతులకు పోడుపట్టాలు అందించారు. విద్యుత్తు సౌకర్యం లేని 6 లక్షల ఎకరాలకు ఈ పథకాన్ని వర్తింపజేయగా.. గిరిజన రైతుకు రెండున్నర ఎకరాల కన్నా ఎక్కువ భూమి ఉంటే సింగిల్ యూనిట్, అంతకు తక్కువగా ఉంటే సమీప రైతులను కలిపి బోర్‌వెల్ యూజర్ గ్రూపుగా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మే 25లోపు మండలాల వారీగా అర్హులైన ఎస్టీ రైతులను గుర్తిస్తారు. జూన్ 10లోపు క్షేత్రస్థాయిలో పరిశీలించి భూగర్భ జలాల సర్వే తదితర పనులను గిరిజన సంక్షేమశాఖ చేపడుతుందని అధికారులు తెలిపారు. జూన్ 25 నుంచి 2025 మార్చి 31 వరకు భూముల అభివృద్ధి, బోరుబావుల తవ్వకం, సోలార్ పంపుసెట్ల ఏర్పాటు పనులను పూర్తి చేయనున్నారు. ఇక మొదటి ఏడాది 10 వేల మంది రైతులకు చెందిన 27,184 ఎకరాలను సాగులోకి తీసుకొచ్చేందుకు రూ.600 కోట్లు ఖర్చుచేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.

## యూట్యూబర్ జ్యోతి కేసులో విస్తుపోయే విషయాలు



న్యూఢిల్లీ,గూఢచర్యం (గూఢచర్యం) కేసులో అరెస్టయిన హర్యానాకు చెందిన యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా (జ్యోతి మల్హోత్రా) కేసులో విస్తుపోయే విషయాలు వెల్లడయ్యాయి. పహల్గాం ఉగ్రదాడి జరగడానికి కొన్ని నెలల ముందు ఆమె ఆ ప్రాంతాన్ని సందర్శించినట్లు దర్యాప్తులో ఉంది. అంతేకాదు అక్కడ వీడియోలు తీసినట్లు కూడా అధికారులు పేర్కొన్నారు. ఆ వీడియోలను పాక్ ఏజెంట్ల (పాక్ ఏజెంట్లు)తో పంచుకున్నట్లు. అధికారులు మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.ఆరోపణతో హర్యానాకు చెందిన ట్రావెల్ వ్లాగర్ జ్యోతి మల్హోత్రా (జ్యోతి మల్హోత్రా)ను శనివారం అధికారులు అరెస్టు చేశారు చేసిన విషయం. పాకిస్థాన్‌లోని ఐఎస్ఐతో సంబంధాలున్న పాకిస్థాన్‌లోని పాకిస్థాన్ హైకమిషన్ ఉద్యోగి డానిష్‌తో జ్యోతి మల్హోత్రాకు సన్నిహిత సంబంధాలున్నట్లు తెలిసింది. ఈ కేసు దర్యాప్తులో కీలక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. పహల్గాం ఉగ్రదాడికి దాదాపు మూడు నెలల ముందు ఆమె తరచూ జమ్ము కశ్మీర్‌లో ఉన్నట్లు కూడా అధికారులు గుర్తించారు. ఒకసారి చైనాకు కూడా వెళ్లొచ్చినట్లు తేలింది. 'ఆపరేషన్ సిందూర్' అనంతరం ఉద్రిక్తతల సమయంలో ఆమె డానిష్‌తో టచ్‌లో అధికారులు నిర్ధరించారు. జ్యోతిని అతడు ట్రాప్ పేర్కొన్నాడు.ట్రావెల్ వ్లాగర్ జ్యోతి.. 'ట్రావెల్ విత్ జో' పేరుతో యూట్యూబ్ ఛానెల్ నడుపుతోంది. కమీషన్ ఏజెంట్ల ద్వారా వీసా పొందిన జ్యోతి2023లో పాక్‌ను సందర్శించింది. ఆమె ఎవరికీ అనుమానం రాకుండా పాక్ అధికారులకు అనుమానం వచ్చినట్లు తేలింది. ఈ కేసులో జ్యోతి మల్హోత్రా ట్రావెల్ వ్లాగర్‌తో కలిసి పని కోరబడింది. ఐదుగురితో కలిసి ముఠాగా ఏర్పడి హర్యానా, పంజాబ్ నుంచి ఇన్ ఫార్మర్లుగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. మన దేశంలోని ప్రాంతాలకు సంబంధించిన సున్నితమైన పాక్‌తో పంచుకున్నట్లు తేలింది.అంతేకాదు ఓ పాక్ ఇంటెలిజెన్స్ ఆపరేటివ్‌తో సన్నిహితంగా మెలుగుతున్నట్లు కూడా తేలింది. అతడితో ఆమె అంతర్జాతీయ ట్రిప్‌కు కూడా వెళ్లింది. ఇండోనేషియాలోని బాలిక విహారయాత్రకు వెళ్లి వచ్చినట్లు దర్యాప్తు అధికారులు తెలిపారు. జ్యోతిపై భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్ 152 సహా పలు సెక్షన్ల కింద అభియోగాలు మోపారు. ఇక దర్యాప్తులో తాను తప్పు చేసినట్లు జ్యోతి రాతపూర్వకంగా అంగీకరించినట్లు సమాచారం. జ్యోతితోపాటు ఐదుగురి గుట్టును కూడా అధికారులు బయటపెట్టారు. వారందరినీ అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

## మూడు తరాలపై అక్రమ విద్యుత్ కనెక్షన్ల మృత్యు కాటు



హైదరాబాద్ : హైదరాబాద్ పాతబస్తీలోని గుల్జార్‌హౌస్ ప్రాంతంలో సంభవించిన ఘోర అగ్నిప్రమాదం మృత్యుపాశాన్ని మోసుకొచ్చింది. ఈ ఘటనపై పోలీసులు, ఫైర్ సిబ్బంది ప్రాథమికంగా చేసిన దర్యాప్తులో ఓ కీలక విషయాన్ని బయటపెట్టింది. ఆ విషాదానికి మూలం అక్రమ కరెంట్ కనెక్షన్ ఉన్న ఉన్నట్టు అధికారులు అనుమానిస్తున్నారు. ప్రభావిత భవనానికి ఎదురుగా ఉన్న నగల దుకాణం రాత్రి మూతపడిన అనంతరం, అక్కడి కొన్ని కుటుంబాలు హైటెన్షన్ వైర్ నుంచి కరెంట్‌ను కోక్కేల ద్వారా అక్రమంగా వినియోగిస్తున్నట్లు సమాచారం. ఈ అక్రమ లైన్‌ను ఉపయోగిస్తూ బాధిత కుటుంబం ఇంటి కరెంట్ మీటర్‌పై ఎక్కువ లోడ్ పడినట్లు తెలుస్తోంది. అదే లోడ్ కారణంగా మీటర్‌బాక్స్‌లో మం టలు చెలరేగినట్టు.. ఆ మంటలు మొదట మీటర్ బాక్స్‌లో వచ్చి, ఆ బాక్స్ పక్క న ఉన్న ఉడెన్ షోకేజ్‌ను అంటుకున్నాయి.అక్కడ నుంచి మంటలు మరింతగా వ్యాపించి ఏసీ కంప్రెసర్ వరకు తాకాయి. అప్పటికే భవనం పై అంతస్తుల్లో ని ద్రిస్తున్న కుటుంబ సభ్యులు ఏమీ గ్రహించకుండానే మంటలు ఇంటి అంతటా విస్తరించాయి. ఈ ప్రమాదానికి కారణమైన అక్రమ కరెంట్ కనెక్షన్లపై పోలీసులు, ఫైర్ సిబ్బంది ప్రత్యేక దర్యాప్తు ప్రారంభించారు. హైటెన్షన్ లైన్ల నుంచి వ్యక్తిగతంగా కరెంట్ తీసుకోవడాన్ని గమనించి, విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చినట్టు సమాచారం.ఈ నేపథ్యంలో స్థానికంగా మరిన్ని ఇలాంటి అక్రమ కనెక్షన్లున్నాయా అనే దానిపై విచారణ కొనసాగుతోంది. ఈ ఘటనతో చిన్నచిన్న నిబంధనల ఉల్లంఘన ఎంతటి ప్రాణ నష్టం కలిగించగలదో మరోసారి తేలిపోయింది.

మూడు తరాలను మింగేసి అగ్నిప్రమాదం

హైదరాబాద్‌లోని పాతబస్తీ గుల్జార్ హౌజ్ వద్ద ఘోర అగ్ని ప్రమాదం జరిగి ఆదివారం ఉదయం 17 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. వారందరూ ఒకే కుటుంబానికి చెందిన మూడు తరాలవారు. గుల్జార్‌హౌజ్ వద్ద ముత్యాల వ్యాపారి ప్రహ్లాద్ మోదీ(73)కి జీ ప్లస్ 2 బిల్డింగ్ ఉంది. కింద పోర్షన్‌లో వారికి 3 ముత్యాల దుకాణాలు ఉన్నాయి. ప్రహ్లాద్ మోదీ తాత దాదాపు 150 ఏళ్ల క్రితం ముత్యాల వ్యాపారం చేసేందుకు హైదరాబాద్ వచ్చారు. గుల్జార్ హౌజ్ వద్ద ఓ బిల్డింగ్ కొని వ్యాపారాన్ని ప్రారంభించారు. ఆ వ్యాపారాన్ని ప్రహ్లాద్ మోదీ తండ్రి పూనంచంద్ కొనసాగించారు.అతడి నుంచి ఈ వ్యాపారాన్ని ప్రహ్లాద్ మోదీ, అతడి సోదరుడు రాజేంద్ర కుమార్ మోదీ తీసుకున్నారు. బిల్డింగ్‌లోని కింది భాగంలో ముత్యాల వ్యాపారం చేస్తున్న ప్రహ్లాద్ మోదీ, అదే బిల్డింగ్‌లోని పై రెండు అంతస్తుల్లో కొడుకులు, మనుమలతో కలసి ఉంటున్నారు. ప్రహ్లాద్ మోదీకి ఇద్దరు కొడుకులు, ఇద్దరు కుమార్తెలు.చిన్న కుమారుడు పంకజ్ మోదీ, భార్య ముగ్గురు పిల్లలతో తండ్రి వద్దే ఉంటున్నాడు. అగ్ని ప్రమాదంలో ప్రహ్లాద్ మోదీ దంపతులతో పాటు వారి కుమారుడు, ఇద్దరు కుమార్తెలు, మనుమలు, మనవరాళ్లు ప్రాణాలు కోల్పోయారు. ఒకే కుటుంబానికి చెందిన మూడు తరాలవారు మృతి చెందడంతో బంధుమిత్రులు శోకసంద్రంలో మునిగిపోయారు.

## జస్టిస్ యశ్వంత్ వర్మపై ఎఫ్ఐఆర్.. పిటీషన్‌పై విచారణకు సుప్రీం అంగీకారం



న్యూఢిల్లీ: అలహాబాద్ హైకోర్టు జస్టిస్ యశ్వంత్ వర్మ(జస్టిస్ యశ్వంత్ వర్మ)పై.. ఎఫ్ఐఆర్ నమోదు చేయాలనే అంశంపై సుప్రీంకోర్టు స్పందించింది. ఆ న్యాయమూర్తి ఇంట్లో నోట్ల కట్టలు దొరికిన ఘటనలో.. ఆయనపై కేసు నమోదు చేయాలని సుప్రీంలో పిటీషన్ దాఖలైంది. అత్యవసర విచారణ చేపట్టాలని పిటీషనర్ దానిపై. అయితే ఆ విషయం చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ ఆగస్టిన్ జార్జ్ మాషితో కూడిన ధర్మాసనం రియాక్ట్ అయ్యింది. పిటీషన్‌లో లోపాలు సవరిస్తే, మంగళ వారం ఆ పిటీషన్‌ను విచారణకు స్వీకరిస్తామని ధమాసనం గుర్తించింది. మాథ్యూస్ నెదుంపర అనే వ్యక్తి పిటీషన్ వేశారు. అయితే లోపాలను సవరిస్తానని, కానీ ఆ పిటీషన్‌పై బుధవారం విచారణ చేపట్టాలని మాథ్యూస్ కోర్టులో ఉంది. అత్యున్న'త న్యాయస్థానం దానికి అంగీకారం ఉంది.మార్చి 14వ తేదీన.. హోలీ రోజు రాత్రి.. ఢిల్లీలో ఉంటున్న జస్టిస్ వర్మ ఇంట్లో అగ్నిప్రమాదం జరిగింది.

స్టోర్‌రూమ్‌లో నోట్ల కట్టలను కాల్చివేసినట్లు ఆధారాలు కనిపించాయి. ఇంకా గుట్టలు గుట్టలుగా క్యాష్ ఉన్నట్లు పేర్కొన్నారు. అయితే ఆ అనేక మంది స్టోర్‌రూమ్‌ను వాడుకుంటార'ని, త'నకుష్‌తో సంబంధం లేదని చెప్పారు. అప్పుడు సీజేఐగా ఉన్న జస్టిస్ సంజీవి ఖన్నా.. జస్టిస్ వర్మపై దర్యాప్తునకు పట్టుకున్నారు. దాని ద్వారా రాజీనామా చేయవలసి ఉంటుంది. కానీ జస్టిస్ వర్మ రాజీనామాకు అంగీకరించకపోవడంతో ఆ విషయాన్ని రాష్ట్ర పతి ముర్ము, ప్రధాని మోదీకి లేఖ ద్వారా జస్టిస్ ఖన్నా తెలియజేశారు.నేరాభియోగం కింద తక్షణమే జస్టిస్ వర్మపై దర్యాప్తు చేపట్టాలని పిటీషన్‌లో మాథ్యూస్‌తో పాటు మరో ముగ్గురు డిమాండ్ చేశారు. జస్టిస్ వర్మపై వచ్చిన ఆరోపణల్లో నిజం ఉన్నట్లు ఇన్‌హౌజ్ కమిటీ కూడా రిపోర్టు సమర్పించింది. ఇన్‌హౌజ్ విచారణ రిపోర్టు ఆధారంగా జస్టిస్ వర్మపై చార్యలు తీసుకోవాలని పిటీషనర్ కోరాడు.జస్టిస్ వర్మ రాజీనామాకు అంగీకరించకపో వడంతో.. ఆయన్ను ఢిల్లీ హైకోర్టు నుంచి అలహాబాద్ హైకోర్టుకు ట్రాన్స్‌ఫర్ చేశారు. కేంద్రం దీనికి క్లియరెన్స్ ఇచ్చింది. కానీ అలహాబాద్, లక్నో బార్ సంఘాలు ఆయన ట్రాన్స్‌ఫర్‌ను వ్యతిరేకించాయి. జడ్జిగా ప్రమాణం చేసినా.. ఆయనకు ఎటువంటి జూడిషియల్ వర్క్‌ను అప్పగించలేదు.

## మియాపూర్‌లో హైడ్రా కూల్చివేతలు.. 70 ప్లాట్ల యజమానులు..



హైదరాబాద్: తెలంగాణలో అక్రమ నిర్మాణాల కూల్చివేతలు కొనసాగుతున్నాయి. తాజాగా మియాపూర్‌లో హైడ్రా కూల్చివేతలు చేపట్టింది. హెచ్ఎండీఏ లేఅవుట్‌లోని అక్రమ నిర్మాణాలను అధికారులు తొలగించారు. పోలీసులు బందోబస్తు మధ్య కూల్చివేతలు కొనసాగాయి.వివరాల ప్రకారం.. మియాపూర్‌లోని హైదర్‌నగర్‌లో సోమవారం ఉదయం నుంచి హైడ్రా కూల్చివేతలు చేపట్టింది. తప్పుడు పత్రాలతో తమ భూమి కబ్జా చేశారని ఇటీవల 70 మంది ప్లాట్ల యజమానులు ఫిర్యాదు చేశారు. దీంతో, రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు కూల్చివేతలు చేపట్టారు. హెచ్ఎండీఏ లేఅవుట్‌లోని అక్రమ నిర్మాణాలను అధికారులు తొలగించారు. హైకోర్టు ఆదేశాలతోనే అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్నట్టు హైడ్రా అధికారులు తెలిపారు. ఇక, కబ్జాదారుల నుంచి భూములు విడిపించడంపై ప్లాట్ల యజమానులు హర్షం వ్యక్తం చేశారు.

## కేంద్రాన్ని తప్పుపట్టిన తృణమూల్ కాంగ్రెస్..



న్యూఢిల్లీ: పెహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో చేపట్టిన ఆపరేషన్ సింధూర్ గురించి ప్రపంచ దేశాలకు తెలియజేసింది కేంద్ర ప్రభుత్వం దౌత్య బృందాలను పంపుతున్న విషయం తెలిసిందే.అన్ని పార్టీలకు చెందిన ఎంపీలతో ఏడు బృందాలను ఏర్పాటు చేసింది. అయితే ఆ బృందానికి దూరంగా ఉంటున్నట్లు తృణమూల్ కాంగ్రెస్ పార్టీ పేర్కొన్నది. వాస్తవానికి కేంద్రం ప్రకటించిన ఎంపీల లిస్టులో.. తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన ఎంపీ,మాజీ క్రికెటర్ యూసుఫ్ పఠాన్ ఉన్నారు. కానీ విదేశాలకు వెళ్లే దౌత్య బృందం నుంచి తప్పుకుంటున్నట్లు తృణమూల్ పార్టీ చెప్పింది. యూసుఫ్ పఠాన్ పేరును వెనక్కి తీసుకుంటున్నట్లు పేర్కొన్నది. తమ పార్టీని సంప్రదించకుండానే ఎలా ఎంపీ పేరును ప్రకటిస్తారని తృణామూల్ అభ్యంతరం వ్యక్తం చేసింది.తృణమూల్ పార్టీ ప్రతినిధిని ఎలా ఎంపిక చేస్తారని ఆ పార్టీకి చెందిన ప్రధాన కార్యదర్శి,లోక్‌సభ ఎంపీ అభిషేక్ బెనర్జీ తెలిపారు. టీఎంసీ ప్రతినిధిని కేంద్రం ఎలా డిసైడ్ చేస్తుందన్నారు. ప్రతిపక్ష పార్టీల ప్రతినిధు లు తెలుసుకునేందుకు ముందుగా చర్చలు నిర్వహించాలన్నారు. తామేమీ ఆ మీటింగ్‌ను వ్యతిరేకించడం లేదని, జాతీయ భద్రత దృష్ట్యా ఆ అంశాన్ని రాజకీయం చేయడం లేదన్నారు.ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఐక్య సందేశాన్ని ఇవ్వాలని భారత్ నిర్ణయించింది.

## మంత్రి కున్వర్ విజయ్‌షాపై సుప్రీంకోర్టు ఆగ్రహం



న్యూఢిల్లీ,కల్నల్ సోఫియా ఖురేషిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మధ్యప్రదేశ్ మంత్రి కున్వర్ విజయ్ షాపై దేశ సర్వోన్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. మంత్రి క్షమాపణలను అంగీకరించలేమని చెప్పింది.ప్రజాప్రతినిధిగా ఉన్నప్పుడు బాధ్యతగా ఉండాలని తెలియదా? అని ఫైర్ అయింది. మంత్రి వ్యాఖ్యలపై మధ్యప్రదేశ్‌కు చెందిన ఐపీఎస్‌లతో సిట్ ఏర్పాటుకు ధర్మాసనం ఆదేశించింది. ముగ్గురు సీనియర్ ఐపీఎస్‌లతో సిట్ ఏర్పాటు చేయాలని సూచించింది. సిట్‌లో ఒక మహిళ ఉండాలని వెల్లడించింది. నివేదిక ఈనెల 28లోపు అందజేయాలని సిట్‌ను ఆదేశించింది.పాకిస్థాన్‌పై భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. కల్నల్ సోఫియా ఖురేషి నాయకత్వంలో ఆపరేషన్ జరిగింది. అయితే మధ్యప్రదేశ్‌కు చెందిన మంత్రి కున్వర్ అనుచిత వ్యాఖ్యలు చేశారు. పహల్గామ్‌లో మన సోదరీమణుల సిందూరం తుడిచేస్తే.. అదే ఉగ్రవాదుల మతానికి చెందిన సోఫియా ఖురేషిని ప్రధాని మోడీ పాక్‌కు పంపించారని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలే తీవ్ర దుమారం రేపాయి. ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ అభ్యంతరం వ్యక్తం చేసింది.ఇక మంత్రి వ్యాఖ్యలపై మధ్యప్రదేశ్ హైకోర్టు సీరియస్ అయింది. ఆయనపై కేసు నమోదు చేయాలని ఆదేశించింది. అనంతరం కేసు నమోదు విషయంలో పోలీసులు సెక్షన్లు నమోదు చేయకపోవడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇక కేసును కోర్టు పరిధిలో పర్యవేక్షించాలని ఆదేశించింది.

## గోల్డెన్ టెంపుల్‌ని టార్గెట్ చేసిన పాక్..



అమృత్‌సర్:పహల్గాం ఉగ్రవాద దాడి తర్వాత ఆపరేషన్ సింధూర్‌తో పాకిస్తాన్‌పై భారత్ ప్రతీకారం తీర్చుకుంది. మే 7వ తేదీన పాక్?లోని తొమ్మిది ఉగ్ర స్థావరాలను మిస్సైళ్లతో ధ్వంసం చేసింది.అయితే, ఆ తర్వాత పాక్ పంజాబ్ రాష్ట్రంలోని అమృత్‌సర్‌లో గల స్వర్ణ దేవాలయాన్ని టార్గెట్‌గా చేసుకుని డ్రోన్లు, మిస్సైల్స్ తో దాడికి ప్రయత్నించింది అని GOC మేజర్ జనరల్ కార్తీక్ సి శేషాద్రి ఈ రోజు మీడియాకు తెలిపారు. ఇక, గోల్డెన్ టెంపుల్ ని లక్ష్యంగా చేసుకున్న అన్ని డ్రోన్‌లు, క్షిపణులను ఇండియన్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ సమర్థవంతంగా తిప్పికొట్టినట్లు వెల్లడించారు. ఉగ్ర స్థావరాలపై భారత్ జరిపిన దాడులతో ఉక్కిరిబిక్కిరైన పాక్ మన దేశంలోని సైనిక స్థావరాలు, నివాస ప్రాంతాలు, ప్రార్థనా మందిరాలపై దాడి చేసేందుకు ప్లాన్ చేస్తుందని ముందుగానే ఊహించింది భారత సైన్యం. దీంతో స్వర్ణ దేవాలయం పరిసరాల్లో పూర్తిస్థాయి వైమానిక రక్షణ కల్పించినట్లు తెలిపారు.అలాగే, మే 8వ తేదీన పాకిస్తాన్ మానవ రహిత వైమానిక దాడులు చేపట్టిందని మేజర్ జనరల్ కార్తీక్ సి శేషాద్రి పేర్కొన్నారు. ప్రధానంగా డ్రోన్లు, దీర్ఘ-శ్రేణి క్షిపణులతో దాడులకు పాల్పడినట్లు చెప్పుకొచ్చారు. ఆకాశ్ క్షిపణి వ్యవస్థ, L-70 ఎయిర్ డిఫెన్స్ గన్స్ లాంటి భారత వైమానిక రక్షణ వ్యవస్థలు అమృత్‌సర్‌లోని స్వర్ణ దేవాలయాన్ని, పంజాబ్ లోని నగరాలను పాక్ దాడుల నుంచి కాపాడిన వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఆపరేషన్ సింధూర్ తో సాయుధ దళాలు పాక్ లోని అనేక ప్రదేశాలను అత్యంత కచ్చితత్వంతో దాడి చేసి నాశనం చేశారని వెల్లడించారు. ఉగ్రవాద సంస్థల ప్రధాన కార్యాలయాలు ఉన్న మురిద్కే, బహవల్పూర్ వంటి ప్రాంతాలపై దాడి చేసి పూర్తిగా ధ్వంసం చేసినట్లు మేజర్ జనరల్ చెప్పారు.

## సంపాదకీయం

**మంగళవారం 20-05-2025**

# పాక్ ఆక్రమి కాశ్మీర్ పోరు చేపట్టాలి !

కాశ్మీర్ లేకుంటే పాక్ బతుక జాలదు. రాజకీయాల్లో రాణించాలంటే కాశ్మీర్ అంశం కావాలి. కాశ్మీర్ అంశం లేకుంటే మిలిటరీని పట్టించుకోరు. కాశ్మీర్ లేకుంటే ఉగ్రవాదులు మనజాలరు. ఇన్నిరకాలుగా కాశ్మీర్‌తో పాక్ రాజకీయాలు ముడిపడి ఉన్నాయి. దీనంతటికీ విభజన సమయంలో సరైన నిర్ణయాలు తీసుకోక పోవడం, కాశ్మీర్ విషయంలో నెహ్రూ అనుసరించిన మెతకవైఖరి కూడా కారణం. ఆ తరవాత అధికారం చేపట్టిన కాంగ్రెస్ దీనిని కొనసాగించడం వల్ల కూడా కాశ్మీర్ రావణ కాష్టంలా మారింది. భారత్‌లో అలజడి సృష్టించేందుకు పాక్ చేస్తున్న ప్రయత్నాలు ఈ నాటివి కాదు. భారత్ నుంచి విడివడ్డ నాటి నుంచి అంటే 1947 నుంచి కుట్రలు పన్నుతూనే ఉంది. సరిహద్దుల్లో ఉద్రిక్తతలు సృష్టించి తీవ్రవాదులను దేశం దాటించాలని అక్కడి సైన్యం చూస్తోంది. సరిహద్దుల్లో తీవ్రవాదలును చొప్పించేందుకు సిద్దంగా ఉన్న పాక్ సైన్యం కాల్పుల ద్వారా తరచూ దృష్టి మరల్చేందుకు ప్రయత్నాలు చేస్తోంది. సరిహద్దులో పాకిస్థాన్ పదేపదే కాల్పులకు తెగబడుతున్న తీరు దాని కుత్సిత బుద్ధికి నిదర్శనంగా చెప్పుకోవాలి. పాక్‌కు మాటల తో సమాధానం చెప్పలేమని గతానుభవాలను బట్టి తెలుసుకోవాలి. పాక్‌లో అంతర్గ సంక్షోభాలు వచ్చిన ప్పుడల్లా ఇలా భారత్‌పైకి దాడులకు దిగుతారు. పాకిస్తాన్ ప్రజలను రెచ్చ గొట్టేందుకే కాశ్మీర్ విషయంలో ఎప్పుడూ వివాదం సృష్టిస్తూనే ఉంటారు. ఆక్రమిత కాశ్మీర్ ఇప్పటికీ ఈ సమస్య రాజుకుంటూనే ఉంది. దౌత్య పరంగా తప్పటడుగుల వేయడంతో భారత్‌కు తిప్పలు తప్పలేదు. ఇప్పటికైనా మోడీ దీని పరిష్కారాన్ని చేతల్లోకి తీసుకోవడం ద్వారా శాశ్వత పరిష్కారానికి తెగువ చూపారు. కాశ్మీర్‌లో జరుగుతన్న హింసాకాండ వెనక పాక్ ప్రోద్బలం నిరంతరాయంగా సాగడానికి కాంగ్రెస్ పాలకులు దోహదపడ్డారు. అందుకే 370 ఆర్టికల్ తరవాత కాశ్మీరీల్లో ఇప్పుడిప్పుడే ఆత్మస్థయిర్యం వచ్చింది. బతకాడానికి అవకాశాలు వచ్చాయి. ఇంతకాలం ఉగ్రవాదులకు భయపడి బతికే వారు. ఇప్పుడే అక్కడా స్వేచ్ఛా పవనాలు వీచాయి. ఈ క్రమంలో దీనిని తట్టుకోలేని పాక్పహల్గామ్ దాడితో మళ్లీ చిచ్చు రగిల్చే ప్రయత్నం చేసింది. అయితే దీనికి ప్రభుత్వం దీటైన జవాబివ్వడం ద్వారా గతంలో లాగా మీ ఆటలు సాగవని మోడీ ప్రభుత్వం తేల్చిచెప్పింది. 370 ఆర్టికల్ రద్దు తరవాత ప్రశాంతంగా ఉంటున్న కాశ్మీర్‌లో ఈ మధ్యకాలంలో మళ్లీ ఉగ్రవాదుల బరితెగింపు మొదలయ్యింది. పాక్‌లో ప్రభుత్వం మారినా పరిస్థితి మారలేదనడానికి ఇది నిదర్శనం. అడపాదడపా హిందువులు లక్ష్యంగా ఉగ్రమూకలు కాల్పులకు తెగబడుతూ ..పహల్గాం ద్వారా రక్తపుటేరులు పారించారు. కాశ్మీర్‌లో ప్రత్యేక హోదాను అడ్డం పెట్టుకుని అక్కడ రాచరికం అనుభవించిన అబ్దుల్లాలో, ముఫ్తీలు కూడా కాశ్మీర్‌లో తమ పెత్తనం కొనసాగేలా చూస్తుంటారు. కాశ్మీర్‌లో ఇప్పటికే 75శాతం పండిట్లను ఊచకోత కోసారు. ఉన్నవారు ఊరు విడిచి వెళ్లిపోయారు. దేశంలో ఎక్కడో ఓ చోట తలదాచుకుంటున్నారు. అయినా వారికి న్యాయం చేయాలన్న జ్ఞానం ఈ నేతలకు లేదు. కాశ్మీర్‌లో శాంతియుత పరిస్థితులు నెలకొనడం అత్యావశ్యకం. అక్కడి అమాయక ప్రజలు ఉగ్రమూకల కారణంగా జీవితాలు కోల్పోరాదు. వారు ఏ మతం వారైనా సామాన్యులే అన్న విషయం గుర్తించాలి. అందుకే ఇక కాశ్మీర్ విషయంలో తేలాల్సింది పాక్ ఆక్రమిత కాశ్మీర్ సమస్య మాత్రమే. దీనిని అంతర్జాతయ సమస్యను చేయడం ద్వారా పాక్ పీచమణచాలి. కాశ్మీర్‌పై నానాయాగీ చేస్తూ రాజకీయ పబ్బం గడుపుకుంటూ భారత్‌ను చికాకు పెట్టే పాక్ కుతంత్రాలకు దీటుగా కఠినంగా జవాబివ్వాలి. పాక్ ఆక్రమిత కాశ్మీరీలు కూడా అక్కడ అణచివేతకు వ్యతిరేకంగా పోరాడుతు న్నారు. తమను భారత్ కాశ్మీర్‌లో కలపాలని ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నారు. ఈ సమయంలో 370 ఆర్టికల్ రద్దు తరవాత పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో ప్రజలు స్వచ్ఛందగా అక్కడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళం విప్పారు. ఈ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుంటే కాశ్మీర్‌లో ప్రశాంత పరిస్థితులకు కృషి చేస్తూనే ఆక్రమిత కాశ్మీర్ స్వాధీనానికి అడుగులు వేయాలి. పాక్‌ను దెబ్బ కొడుతూనే పివోకెను స్వాధీనం చేసుకోవాలి. ఆపరేషన్ సిందూర్ ఆగిపోలేదు కనుక ఏ మాత్రం తేడా వచ్చినా పాక్‌ను దెబ్బకొడుతూనే ఉండాలి. అలాగే దేశం యావత్తూ కేంద్రం తీసుకుంటున్న చర్యలు స్వాగతించాలి. జమ్మూ–కశ్మీర్ అంశంపై భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ తమ స్వరాన్ని పెంచి, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ లక్ష్యంగా నినదించాలి. నిజానికి తమ అజెండా ఇక పాక్ ఆక్రమిత కాశ్మీర్ అని చెప్పడం ద్వారా సమస్యపై పాక్‌కు సవాల్ విసిరారు. కేంద్రం ఈ విషయంలో స్పష్టత ఇచ్చింది. ఉగ్రవాదం, పివోకెలే తమ అజెండా అని తేల్చింది. ఇంతకాలం కాశ్మీర్ సమస్యను అడ్డుగా పెట్టి అరాచకం చేస్తున్న పాక్‌కు కనువిప్పు కలిగించాలి. ఉగ్రవాదాన్ని ఎగదోయడాన్ని ఆపనంత కాలం పాకిస్థాన్‌తో చర్చలు అసాధ్యమని ఆపరేషన్ సిందూర్ తరవాత భారత్ స్పష్టం చేయడంతో పాటు, పాక్ కుతంత్రాలను ప్రపంచానికి తెలియచేసారు. ఒకవేళ పాక్‌తో చర్చలు జరపాల్సి వస్తే అవి పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే) పైనే ఉంటాయని తేల్చి చెప్పారు. ఇది కాక మరో అంశంపై సంప్రదింపులు ఉండబోవని కుండబద్దలు కొట్టారు. ఉగ్రవాదం ద్వారా భారత్‌ను అస్థిరపరిచి విచ్ఛిన్నం చేయాలని పాక్ కుట్ర పన్నుతోందని ప్రపంచం యావత్తూ గుర్తించిన నేపథ్యంలో పాక్ ఆక్రమిత కాశ్మీర్ ఎజెండాగా పనిచేయాలి. 370 రద్దు తర్వాత ఇప్పుడు పీవోకే ప్రజలు భారత్‌లో విలీనం కావాలని కోరుకుంటున్నారు. పాక్ అక్రమ కబ్జా నుంచి పీవోకేకి విముక్తి కల్పించి, భారత్‌లో అంతర్భాగంగా మార్చాలన్న వారి కలను సాకారం చేయాలి. పీవోకే రాజధాని ముజఫరాబాద్‌ను మనం స్వేచ్ఛగా సందర్శించే రోజు రావాలని ప్రార్థిద్దాం. ఇదే క్రమంలో పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో ప్రజల అణచివేతపై పోరాడాలి. అలాగే మన కాశ్మీర్‌లో అశాంతి రాజేస్తున్న ఉగ్రమూకలను చీల్చి చెండాడాలి. పరిస్థితులు ఏమాత్రం చేయి దాటిపోకుండా భద్రతా బలగాలు కృషి చేస్తున్నాయి. ఇంత జరుగుతున్నా పాక్ తన ప్రేలాపనలు ఆపడం లేదు. మొత్తంగా కశ్మీర్‌లో పరిస్థితులను చక్కదిద్దేందుకు కొన్నేళ్లుగా కేంద్రం తీసుకున్న చర్యలు విఫలం అయ్యేలా స్థానిక నేతలు, పాక్ ప్రేరేపిత సంస్థలు పనిచేస్తూ వచ్చాయి. మరోమారు కాశ్మీర్‌లో వేలుపెట్టకుండా పాక్‌కు గట్టి బుద్ధి చెప్పాలి. అలాగే కాశ్మీర్‌లో ఉగ్రమూకల ఏరివేతను మరింత సవాల్‌గా తీసుకోవాలి. అక్కడ ఉగ్రవాదులు కాలుపెట్టకుండా కఠినంగా వ్యవహరించాలి. ఉగ్రమూక లకు అండగా నిలుస్తున్న వారు ఎంతటి వారైనా బుద్ధి చెప్పాలి. స్థానికమప్రజల అండ లేకుండా చేయాలి. నాయకులైతే కోర్టు బోనులో నిలబెట్టాలి.

# కాంగ్రెస్‌తో బీజేపీ మైండ్‌గేమ్!



న్యూఢిల్లీ, ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా ప్రపంచ దేశాలకు ఢిల్లీ సందేశాన్ని చేరవేసేందుకు కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం కదిపినపావులు రాజకీయంగా ఆసక్తి రేపుతున్నాయి. ఇండియా కూటమికి సారథ్యం వహిస్తున్న కాంగ్రెస్‌ను అదే కూటమిలో మరోసారి ఏకాకిని చేయడంలో బీజేపీ సఫలమైంది. అదే సమయంలో కాంగ్రెస్‌పార్టీలో అంతర్గత సమస్యలు కూడా బహిర్గతమయ్యాయి. వివిధ దేశాలకు పంపే భారత బృందాలకు వివిధ పార్టీల నుంచి కూడా నేతలను ఎంపిక చేశారు. ఈ క్రమంలో కాంగ్రెస్ తన తరఫున నాలుగు పేర్లను ప్రతిపాదించింది. అయితే.. అనూహ్యంగా.. ఆ నాలుగు పేర్లలో లేని శశిథరూర్‌ను ఎంపిక చేయడం ద్వారా బీజేపీ మైండ్‌గేమ్ ఆడిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కాంగ్రెస్ ప్రతిపాదించినవారిలో మాజీ కేంద్ర మంత్రి ఆనంద్ శర్మ, లోక్‌సభలో కాంగ్రెస్ ఉప నేత గౌరవ్ గగోయ్, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ సయీద్ నజీర్ హుస్సేన్, లోక్‌సభ సభ్యుడు రాజా బ్రార్ ఉన్నారు. కానీ.. వీరినెవ్వరినీ బీజేపీ పరిగణనలోకి తీసుకోకపోవడం గమనార్హం. ప్రభుత్వం ఒక్కో పార్టీ నుంచి ప్రతినిధిని ఎంపిక చేసే పక్షంలో పేర్లు అడగాల్సిన అవసరం ఏంటన్న చర్చ కూడా వస్తుంది. రాహుల్‌గాంధీని నిస్సహాయుడిని చేసే క్రమంలోనే బీజేపీ ఈ మైండ్‌గేమ్‌కు పాల్పడిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**శశిథరూర్ వర్సెస్ అధిష్ఠానం**

కాంగ్రెస్‌లో శశిథరూర్ వర్సెస్ పార్టీ అన్నట్టు పరిస్థితులు చాలాకాలంగా ఉన్నాయి. ప్రత్యేకించి పాక్ ఉగ్రవాదుల దాడి నేపథ్యంలో భారత సైన్యం తీసుకున్న చర్యల విషయంలో ప్రభుత్వాన్ని అభినందిస్తూ శశిథరూర్ మాట్లాడారు. దానికి అధికారపక్షం నుంచి ప్రశంసలు రాగా.. సొంత పార్టీ నుంచి విమర్శలు వెల్లువెత్తాయి. ఒకవైపు సీజ్‌ఫైర్ ఒప్పందం విషయంలో మోదీ ప్రభుత్వాన్ని టార్గెట్ చేసిన కాంగ్రెస్.. ఏ షరతులకు లొంగి సీజ్‌ఫైర్‌కు ఒప్పుకొన్నారని ప్రశ్నిస్తున్నది. ఈ తరుణంలో సైనిక చర్యలపై ప్రశంసలు కురిపించిన శశిథరూర్‌ను ఎంపిక చేయడం కాంగ్రెస్‌కు పుండుపై కారం చల్లినట్టయిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పార్టీ అధిష్ఠానంతో థరూర్‌కు సరైన సంబంధాలు లేవన్న అభిప్రాయాలు ఉన్నాయి. 2014లో మోదీ గురించి ఒక పాజిటివ్ వ్యాసం రాయడంతో శశిథరూర్‌ను పార్టీ అధికార ప్రతినిధి హోదా నుంచి తప్పించారు. పార్టీలో సంస్థాగత సంస్కరణలకు 2020లో డిమాండ్ చేసిన జీ 23 నేతల బృందంలో థరూర్ కూడా ఒకరు. ఆ తర్వాత ఆ బృందంలోని చాలా మంది కాంగ్రెస్‌ను వదిలేశారు. 2022లో కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికల డ్రామా కూడా ఇక్కడ ప్రస్తావనార్హం. కాంగ్రెస్ పార్టీలో ప్రజాస్వామ్యం ఉందని బలవంతంగా చాటి చెప్పేందుకు జరిగిన ప్రయత్నంలో అధ్యక్ష ఎన్నిక నిర్వహించారు. ఆ స్థానానికి గాంధీ కుటుంబం మల్లికార్జున ఖర్గేను బలపర్చగా, ఆయనకు వ్యతిరేకంగా శశిథరూర్ పోటీలో నిలిచారు. సహజంగానే గాంధీ కుటుంబం బలపర్చిన నాయకుడే అధ్యక్షుడు అవుతాడనడంలో అప్పుడు కూడా ఎలాంటి సందేహాలు రాలేదు. అదే జరిగింది కూడా. అప్పటికి వెయ్యికిపైగా ఓట్లను శశిథరూర్ సాధించగలిగారు. తాజాగా కాంగ్రెస్ అధికారికంగా ప్రతిపాదించిన పేర్లను కాదని శశిథరూర్‌ను అంతర్జాతీయ దౌత్య బృందానికి నేతృత్వం వహించే అవకాశం ఇవ్వడం ఆ పార్టీలో థరూర్ వర్సెస్ అధిష్ఠానం అనే ఫ్యాక్టర్‌ను మరోసారి ముందుకు తెచ్చిందని రాజకీయ పరిశీలకులు అంటున్నారు.

**దిగ్భ్రాంతికి గురి చేసింది : జైరాం రమేశ్**

తాము ఇచ్చిన పేర్ల నుంచి కాకుండా శశిథరూర్‌ను ఎంపిక చేయడం తమను దిగ్భ్రాంతికి గురి చేసిందని కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ వ్యాఖ్యానించారు. 'తదుపరి ఏం జరుగుతుందో నేను చెప్పలేను. పేర్లు వేరే. మా విధి మేం నిర్వహించాం. ప్రభుత్వం మర్యాదపూర్వకంగానే పేర్లను ప్రతిపాదించమని కోరినట్టు భావించాం. ప్రభుత్వం ఇలా దుష్టతలంపుతో ఎందుకు వ్యవహరించిందో అర్థం కావడం లేదు' అని ఆయన చెప్పారు. ప్రభుత్వ ప్రతిపాదనను థరూర్ అంగీకరించడంపై ప్రశ్నించగా.. కాంగ్రెస్‌లో ఉండటానికి, కాంగ్రెస్‌కు చెంది ఉండటానికి నక్కకు నాగలోకానికి ఉన్నంత దూరం ఉందని వ్యాఖ్యానించారు. ఇటువంటి బహుళ పార్టీ ప్రతినిధి బృందాలు ప్రజాస్వామిక వ్యవస్థలో సాధారణమే. గతంలో 1963లో ఇటువంటి ప్రతినిధి బృందానికి నాటి ప్రతిపక్ష నేత సీ రాజగోపాలాచారిని అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ నియమించారు. ఒక ప్రతినిధి బృందంలో జయప్రకాశ్ నారాయణ్‌ను నాటి ప్రధాని ఇందిరాగాంధీ నియమించారు. అటల్ బిహారీ వాజ్‌పేయిని పీవీ నర్సింహారావు నియమించారు. అయితే.. ఒక ఎంపీ నామినేట్ అయినప్పుడు పార్టీ నాయకత్వం సమ్మతిని పొందాలి.' అని జైరాంరమేశ్ చెప్పారు.

# పహల్గామ్, ఆపరేషన్ సింధూర్ లేవనెత్తిన ప్రశ్నలివీ..



న్యూఢిల్లీ,పహల్గామ్ పర్యాటకులపై "ఉగ్రవాద" అమానుష దాడిని కాశ్మీర్ సహా యావద్భారత ప్రజలు కుల, మత, ప్రాంత భేదాలకు అతీతంగా ఖండించి సమైక్యంగా నిలబడడం గమనార్హం! 'ఆపరేషన్ సిందూర్' తర్వాత ఈ సమైక్యత మరింత పెరగడం మరో గమనార్హ అంశం! ఈ సమైక్యత ఏకపక్షంగా కొనసాగదు. ఇది మోదీ సర్కార్ వైఖరిపై కూడా ఆధారపడి ఉంటుంది.దేశ భద్రత పట్ల మోదీ సర్కార్ పారదర్శక వైఖరి ప్రదర్శించాలి. దేశ ప్రజల ప్రశ్నల పట్ల జవాబుదారీ తనంతో ఉండాలి. వారి మనస్సుల్లో సందేహాల్ని తొలగించపడం ద్వారానే ప్రభుత్వంపై దేశ ప్రజల నమ్మకం పెరుగుతుంది. ఈ క్లిష్ట కాలాల్లో ప్రభుత్వ వైఖరి బాధ్యతాయుతంగా వుండాలి. దేశ భద్రత పట్ల తమ మనస్సుల్లోని సందేహాల్ని తీర్చాలని తామెనుకున్న సర్కార్ ని అడిగే హక్కు దేశప్రజలకు వుంది. ప్రశ్నించే ప్రజల్ని సర్కార్లు నేరస్తులుగా చూడరాదు. కానీ నేడు ప్రశ్నలు కూడా నేరాలుగా మారడం విషాదకరం.యుద్ధం వద్దు, శాంతి కావాలన్నందుకే నేడు నిష్కల్మష దేశ భక్తులు, శాంతికాముకుల్ని దేశ ద్రోహులుగా ముద్రలు వేసిన దుస్థితి తెల్సిందే. ట్రోల్స్ తో మానసికంగా హింసించడం శోచనీయం. అదే ట్రోల్స్ సేన ట్రంప్ "శాంతి" ట్వీట్ కి పండగ చేసుకున్నారు. ప్రశ్నలే నేరాలైన వేళ నిజమైన దేశ భక్తులు, ప్రజాతంత్ర వాదులు మౌనంగా ఉండరాదు. ఈ క్రింది ప్రశ్నల్ని అడుగుదాం.

**పహల్గామ్‌పై ప్రశ్నలు**

1. శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానంతో 24/7 నిఘాతో లక్షల సైన్యం కాపలా వున్నా, పాకిస్తాన్ ఉగ్రవాదులు సరిహద్దు దాటి ఎలా రాగలిగారు?
2. ఒకవేళ కళ్ళుకప్పి సరిహద్దు దాటినా, పహల్గామ్ వరకూ ఎలా రాగలిగారు?
3. రోజూ వేలాది మంది పర్యాటకులు సందర్శించే అతి సున్నిత ప్రాంతంలో నిఘా వ్యవస్థ ఎందుకు లేదు? సీసీ కెమెరాలు సైతం ఎందుకు లేవు?
4. భద్రతను పటిష్టంగా ఏర్పాటు చేయాల్సిన కల్లోల ప్రాంతంలో ఆరోజు ప్రత్యేక బలగాలతో పాటు సాధారణ పోలీసు సైతం ఎందుకు లేదు?
5. ఏప్రిల్ 6న జమ్ము, 7, 8 లలో శ్రీనగర్ లో అమిత్ షా పర్యటించాడు. ఆ సందర్భంగా అత్యున్నత భద్రతా బేటీలో స్థానిక ముఖ్యమంత్రిని ఎందుకు భాగస్వామి చేయలేదు?
6. ఉగ్రవాద ప్రమాదం పొంచివుందని ముందే ఇంటెలిజెన్స్ చేసిన హెచ్చరికల్ని ఎందుకు నిర్లక్ష్యం చేశారు?
7. పహల్గామ్ దుర్ఘటన జరిగిన వెంటనే భద్రతా వైఫల్యానికి కారణాల్ని ఎందుకు సమీక్షించలేదు?
8. స్థానిక ముఖ్యమంత్రి సహా స్థానిక సర్కార్ ను విశ్వాసంలోకి తీసుకొని ఉగ్రవాదంపై సమైక్య పోరుకు అఖిలపక్ష, సర్వమత సమ్మేళనాల్ని కాశ్మీర్ లో ఎందుకు చేయలేదు?
9. సౌదీ నుండి రాగానే మోదీ.. పహల్గామ్ ఉగ్రదాడి స్థల పర్యటన ఎందుకు చేయలేదు? మృత దేహాల సందర్శన, మృతుల కుటుంబాల, క్షతగాత్రుల పరామర్శకు ఎందుకు వెళ్లలేదు?
10. ఢిల్లీలో అఖిలపక్ష సమావేశానికి హాజరు కాకుండా బీహార్ ఎన్నికల ప్రచారానికెలా వెళ్లారు?

ఈ ప్రశ్నల నుండి మోడీ సర్కార్ తప్పించుకోలేదు.

**ఇక 'ఆపరేషన్ సింధూర్' పై ప్రశ్నలకు వద్దాం.**

1. దేశ ప్రజల ఎదుట ఏ వైఖరితో 'ఆపరేషన్ సిందూర్' కి దిగింది? ఏ ముగింపును ఆశించి క్రాస్ బోర్డర్ దాడులు చేసింది? తాను ఆశించిన లక్ష్యం నెరవేరిన తర్వాతే రాజీ చేసుకుందా?
2. ట్రంప్ మధ్యవర్తిత్వం మోదీ కోరిందా? లేదా తానే మధ్యవర్తిత్వన్ని చేస్తానని మోదీని ట్రంప్ కోరాడా? ఇందులో ఏది సత్యం? ఏది అసత్యం?
3. మోదీ కోరివుంటే తన స్వంత కేబినెట్ ద్వారా నిర్ణయం తీసుకున్నాడా? వ్యక్తిగతంగానే నిర్ణయం తీసుకున్నాడా?
4. ఒకవేళ మధ్యవర్తిత్వం చేస్తానని ట్రంప్ కోరితే, మోదీ ఆమోదించాడా? కేబినెట్ ఆమోదించాకే తల ఊపాడా?
5. వాణిజ్య బంధం కట్ చేస్తానని తాను బెదిరిస్తే రెండు దేశాలు కాల్పుల విరమణకు దిగినట్లు ట్రంప్ ప్రపంచం ఎదుట పబ్లిసిటీ చేశాడు. ట్రంప్ బెదిరిస్తే మోదీ లొంగాడా? అది నిజమైతే క్యాబినెట్ లో చర్చపెట్టిన తర్వాతే ఒప్పుకున్నాడా? నిజం కాకపోతే, అబద్దమని ఎందుకు ఖండించలేదు?
6. మే 10న సాయంత్రం మూడున్నర గంటలకు పాకిస్తాన్ రక్షణ శాఖ నుండి రాజీ ప్రతిపాదన వస్తే కాల్పుల విరమణ చేశామని మన విదేశాంగ ప్రతినిధి ప్రకటించాడు. గత రాత్రంతా రెండు దేశాల ప్రతినిధులతో అమెరికా ప్రభుత్వ ప్రతినిధులు చర్చలు నిర్వహించిన ఫలితంగా ఒప్పందం కుదిరిందని పదో తేదీ సాయంత్రం ఐదున్నరకి ట్రంప్ ట్వీట్ చేశాడు. కొద్దిసేపటి తర్వాత అమెరికా విదేశాంగ మంత్రి చేసిన ట్వీట్ లో గత 48 గంటల మధ్యవర్తిత్వం ఫలితంగా ఒప్పందం కుదిరిందని అన్నాడు. ఇది పాకిస్తాన్ రాజీ ప్రతిపాదన కంటే రెండు రోజుల ముందు మాట! 48 గంటల మధ్యవర్తిత్వ ప్రక్రియ సాగినట్లు బాహాటంగా విశ్వవీధుల్లో ప్రచారం జరుగుతోంది. ఆ రోజే ఓ గంట లేదా రెండు గంటల క్రితమే పాక్ కాళ్లబేరానికి వస్తే ఒప్పందం చేసినట్లు మన విదేశాంగ మంత్రి చెబుతున్నారు. ఒకవేళ వాళ్ళు అబద్ధమాడితే ఎందుకు ఖండించడం లేదు? నిజమైతే స్వంత దేశ ప్రజలకు ఎందుకు అబద్దం చెప్పాలి?
7. మే 12న సాయంత్రం దేశ ప్రజల్ని ఉద్దేశించి మోదీ ప్రసంగానికి ముందే అంతర్జాతీయ స్థాయిలో ట్రంప్ ట్వీట్స్ హల్ చల్ సృష్టించాయి. వాణిజ్య కొరడా ఝుళిపించి భారత్ ని లొంగదీసి చర్చల టేబుల్ వద్దకు రప్పించి ఒప్పందం చేయించానని ట్రంప్ బహిరంగ ప్రకటనలు చేస్తున్నాడు. ఐనా మోదీ తన ప్రసంగంలో ఎందుకు మౌనం వహించాడు?
8. ట్రంప్ కి తల వంచిన తర్వాత కూడా వరసగా భారత్ పట్ల వాణిజ్య హుకుంల్ని ట్రంప్ జారీ చేస్తున్నాడు. భారతదేశ ప్రతిష్టను విశ్వ వీధుల్లో దిగజార్చుతూ వరస బెదిరింపు చర్యల్ని చేపడుతున్నాడు. ఈ అవమానకర వైఖరి పై మోడీ ఇంకా మౌనం ఎందుకు వీడడం లేదు?

**దేశభక్తియుత ప్రజలారా! ప్రజాస్వామ్య ప్రియులారా!**

ప్రధానిగా మోదీ ఈ రోజు ఉంటారు. రేపు మరొకరు వస్తారు. ఇది ప్రధాని సమస్య కాదు. దేశ ప్రజల సమస్య! ఇది 145 కోట్ల మంది ప్రజల సమస్య! నిజమైన దేశభక్తులు, ప్రజాతంత్ర ప్రియుల్ని బాధించే సమస్య! క్యూబా, మెక్సికో, కెనడా వంటి దేశాలు అమెరికా పెరటి దొడ్లో వున్నాయి. ఐనా అమెరికా ఎదుట తమ దేశ ఆత్మగౌరవాన్ని కాపాడుకుంటున్నాయి. 145 కోట్ల మంది ప్రజలు దేశభద్రత కోసం ఐక్యంగా తన వెనక నిలబడ్డ వేళ, అమెరికా ఎదుట మోడీ సర్కార్ ఇలా ఎందుకు మోకరిల్లింది?పాక్ ఉగ్రవాద ముప్పు గల లోయ భద్రత కంటే ఆపరేషన్ కగార్ పట్ల బలగాల కేంద్రకరణకు ఎందుకు దిగుతోంది? విదేశీ "ఉగ్ర"మూక ఫహల్గామ్ నుండి తప్పుకోకుండా చర్యల కంటే కర్రేగుట్ట నుండి స్వదేశీ విప్లవకార్లు తప్పుకోకుండా ఎక్కువ. పాకిస్తాన్ తో చర్చలకు మరో విదేశం అమెరికా మధ్యవర్తిత్వానికి సిద్ధం. కానీ స్వదేశీ మావోయిస్టు పార్టీతో చర్చలు నిషిద్ధం. ఈ సమయంలో మోడీ సర్కార్ అనుసరించే ఈ ద్వంద్వ విధానాన్ని కూడా ఖండించడం దేశ ప్రజల కనీస బాధ్యత!పహల్గామ్ "ఉగ్ర"దాడి పై పది ప్రశ్నల్ని, ఆపరేషన్ సిందూర్ పై ఎనిమిది ప్రశ్నల్ని అడగడం నేరం కాదు. అంబానీ, ఆదానే వంటి కార్పొరేట్ల ప్రయోజనాలే మోడీ సర్కార్ దృష్టిలో దేశ ప్రయోజనాలుగా మారాయి. కార్పొరేట్ల చేతుల్లోని మీడియా ప్రజలని బ్రెయిన్ వాష్ చేస్తోంది. దేశ ప్రజల ప్రయోజనాలే దేశ ప్రయోజనాలుగా భావించే ప్రజాస్వామిక, దేశభక్తియుత శక్తులు గళం విప్పాల్సిన వేళ మౌనం వహించడం నేరం. గళం విప్పుదాం. ప్రశ్నిద్దాం.

# శ్రీ వరిసాగుపై చైతన్యం రావాలి

గుంటూరు,శ్రీ వరిసాగు యాజమాన్య పద్ధతులపై రైతులుఅవగాహన పెంచుకోవాలని పలువురు వ్యవసాయ వేత్తలు తెలిపారు. శ్రీవరి సాగు నారు నాటడం, విత్తనాలు ఎద జల్లడం రెండు విధాలుగా చేసుకోవచ్చన్నారు. నీటి యాజమన్య పద్ధతులే ప్రధానం అన్నారు. తక్కువ నీటితో ఎక్కువ ప్రయోజనం శ్రీ వరిసాగు విధానంగా వివరించారు. నత్రజని చాలా తక్కువ మోతాదులో వాడాలని, సేంద్రియ ఎరువులనే వినియోగించాలన్నారు. డెల్టా ప్రాంతంలో నీటి ఎద్దడి తక్కువగా ఉన్నందున, తక్కువ నీటిని వినియోగిస్తూ ఎక్కువ విస్తీర్ణంలో శ్రీ వరిసాగు ద్వారా అధిక దిగుబడులు సాధించ వచ్చన్నారు. ఈతరహాలో బళ్ళారిలో ఎకరాకు 66బస్తాల దిగుబడి సాధించగా, దుగ్గిరాల మండలం చిలువూరులో 48బస్తాలు, బుర్రిపాలెం రైతు 44బస్తాలు దిగుబడులు సాధించినట్లు వివరించారు. రైతు ప్రయోజనాలకు అనుగుణంగా నూతన వ్యవసాయ పద్ధతుల పట్ల అవగాహన కార్యక్రమాల ఏర్పాటు చేయడం పట్ల, రైతులు నిర్వాహకులను అభినందించారు. నీటి యాజమాన్య పద్ధతులు, సేంద్రియ ఎరువుల వాడకం, వరినాటే సమయంలో మొక్కకు, మొక్కకు మధ్య నిర్దేశించిన దూరం అమలు చేయడం వంటి మెళకువలు పాటించడం ద్వారా శ్రీ వరిసాగులో అధిక దిగుబడులు సాధించొచ్చని వివరించారు. రైతు వ్యవసాయ ప్రయోజనాలకు అద్దంపడుతూ, శ్రీ వరిసాగుకు, ఎన్ఆర్ఐ పి-003-రవి రకం విత్తనం వినియోగించాలని, నేల చదునుగా ఉండాలన్నారు. పొలంలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. వరి నాట్ల విషయంలో ఒకమొక్క నాటాలని, మొక్కల మధ్య నిర్దేశించిన దూరం పాటించాలన్నారు.

# ఇష్టారాజ్యంగా బోర్ల తవ్వకాలు

నిజామాబాద్,అధికారుల్లో నెలకొన్న ఉదాసీనత వైఖరిని కొందరు అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. ఫలితంగా వాల్టాచట్టం క్షేత్రస్థాయిలో అమలుకు నోచుకోవడం లేదు. బోరు తవ్వకం సమంలో సమీపంలోని మరోబోరు, బావికి కనీసం 200 మీటర్ల దూరం పాటించాలి. కొత్తగా బోరుబావి వేసుకునే రైతు అధికారులకు సమాచారం ఇవ్వడం ద్వారా శాస్త్రీయపద్ధతులను అనుసరించి జియాలాజికల్ అధికారులు సర్వే నిర్వహిస్తారు. అధికారులు సూచించిన ప్రదేశంలో బోరుబావి పడకుంటే రూ.10వేల వరకు బాధిత రైతుకు బీమా సౌకర్యం లభిస్తుంది. అయితే రైతుల్లో నెలకొన్న అవగాహన లోపంతో తమ ఇష్టాను సారంగా బోరుబావులు తవ్వించి ఆర్థికంగా నష్టపోతున్నారు. రిగ్గుల రిజిస్ట్రేషన్ బోరుబావులు తవ్వే రిగ్గుల యజమాని రూ.10వేలు చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. రిజిస్ట్రేషన్ లేకుండా బోరుబావులను తవుతున్న రిగ్గులను అధికారులు సీజ్‌చేయాల్సి ఉంటుంది. అలాంటి చర్యలేవీ లేకపోవడంతో రిగ్గుల యాజమాన్యాలు తమకు నచ్చిన ప్రదేశంలో బోరుబావి తవ్వకాలు చేపట్టి రైతుల నుంచి వేలాది రూపాయాలు వసూలు చేస్తున్నారు.బోరుబావుల తవ్వకం, చెట్లనరికివేత, నదులు, వాగుల నుంచి ఇసుకతీత, తాగునీటి వనరుల కలుషితం వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు అడ్డుకట్టపడక పోగా, వాల్టా చట్టంలోని నియమనిబంధనలు కాగితాలకే పరిమితమవుతున్నాయి. వర్షాభావంతో చాలాచోట్ల ఇష్టం వచ్చినట్లుగా బోర్ల తవ్వకం చేపడుతున్నారు. బోరుబావుల రిజిస్ట్రేషన్ చట్టం ప్రకారం ప్రతిబావి యజమానీ 10 రూపాయలను రెవెన్యూ కార్యాయలంలో చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. పర్యావరణం, భూగర్భజలాలు, సహజవృక్షసంపద పరిరక్షణ కోసం వాల్టా చట్టాన్ని అమల్లోకి తెచ్చారు. అమలులో పారదర్శకత కొరవడి ఉల్లంఘన చర్యలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారుల మధ్య అవగాహన లోపంతో చట్టం ఉల్లంఘనదారులపై ఎలాంటి చర్యలు చేపట్టడం లేదన్న విమర్శలు వెలువడుతున్నాయి. భవిష్యత్ అవసరాలను దృష్టి లో ఉంచుకొని ప్రభుత్వం కొన్ని నిమయనిబందనలు అందులో పొందుపరిచారు. మునిసిపల్ కార్పొరేషన్, మునిసిపాలిటీ-, గ్రామపంచాయతీల పరిధిలో చెట్లను పరిరక్షించి వాతావారణ కాలుష్యాన్ని నియంత్రించేందుకు రెవెన్యూ, అటవీ శాఖ, గ్రామపంచాయతీ అధికారులు కృషి చేయాలి. ఎవరైనా చెట్ల యజమానిచెట్లను తన అవసరాల కోసం పడ గొట్టాలనుకుంటే అధికారుల నుంచి అనుమతిపొందాలి. చెట్లను నరికివేసిన 30 రోజుల వ్యవధిలో సమీప ప్రదేశంలో రెండు మొక్కలు నాటాల్సి ఉంటుంది. సంబంధిత అధికారులకు అప్పగించిన బాధ్యతలను క్షేత్రస్థాయిలో అమలు చేయకపోవడంతో గ్రామాల్లోని సహజ అటవీ వృక్ష సంపద తగ్గుతున్నది. బొగ్గుబట్టీల వ్యాపారులు గ్రామశివారు భూముల్లోని చెట్లను నరికించి కాల్చడంతో తయారైన బొగ్గొను ఇతరప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఫలితంగా సమీపగ్రామాల్లో వాతావరణ కాలుష్యం పెరుగుతున్నది. నీటి కలుషితంపై నియంత్రణ భూగర్భజలాలు కలుషితం కాకుండా నియంత్రించేందుకు అధికారులు చర్యలు చేపట్టడం లేదు.

# సంస్కరణల పేరుతో పన్నుల భారం

కర్నూలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రపంచ బ్యాంకు సంస్కరణల అమలులో భాగంగా పేద ప్రజలపై పన్నుల భారం మోపి, పేదల నడ్డి విరుస్తున్నాయని పలు ప్రజా సంఘాలు విమర్శించారు. స్థానిక సంస్థలు విధించాల్సిన పన్నులను ప్రభుత్వాలు విధించడం చట్టవిరుద్ధమన్నారు. దీని కారణంగా పేదలపై భారం పడుతోందన్నారు. దీనికి వ్యతిరేకంగా అన్ని వర్గాలను కలుపుకొని ఉద్యమాలు చేస్తామన్నారు. ప్రపంచ బ్యాంకు నుండి అప్పులు పొందడం కోసం వారి ఒత్తిడి మేరకు ప్రజలపై పన్నుల భారాన్ని మోపుతున్నారని తెలిపారు. పంచాయతీ పాలకులు అరకొరగా సిమెంటు రోడ్లపై చెత్తను ఊడ్పించేసి అభివృద్ధి పనులకు వెచ్చించాల్సిన నిధులను తాము ఊడ్చుకుంటుంటారు. పంచాయతీ పరిధిలో మంజూరైన నిధులతో చేబట్టిన అభివృద్ధి పనులకన్నా ఆ నిధులను పాలకుల సొంత అభివృద్ధికే ఎక్కువ వెచ్చించుకున్నట్లు పంచాయతీలోని గ్రామాలను పరిశీలిస్తే ఎవ్వరికైనా అనుమానాలు రాక మానవు. ఇందుకు అధికారులు కూడా పూర్తి స్థాయిలో సహకరించినట్లు ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. పంచాయతీ పరిధిలో అభివృద్ధి అంటే గ్రామాల ప్రజలకు నీటి సరఫరాలో లోటు చేయకుండా చర్యలు చేబట్టడం, ప్రతి గ్రామంలోనూ రాత్రివేళల్లో విద్యుత్ స్తంభాలకు బల్బులు వుండే విధంగా చూసుకోవడం. అన్ని చోట్లా ప్రజలు వీటినే ఆశిస్తారు. పంచాయతీ అభివృద్ధికి అవసరమైన నిధులు పెద్ద ఎత్తున మంజూరైనప్పటికి ఎవ్వరు కూడా పాలకుల్నిగానీ, అధికారుల్ని గాని ప్రశ్నించరు. గ్రామంలోని చేతి పంపులో నీళ్ళు రావడం లేదని మండల పరిషత్ కార్యాలయంలోని అధికారుల దృష్టికి తీసుకెళ్తే పైపులు తక్కువ పడ్డాయని పైపులు వేయడానికి బిల్లులు మంజూరు కావాలంటే సుమారు రెండు మాసాలు పడుతుండటంతో మేమేం చేయలేమని అధికారులు మాట దాట వేస్తున్నారు. ముఖ్యంగా పంచాయతీలో నిధులున్నప్పటికి వాటి వినియోగం కోసం మంజూరు చేయాలంటే జిల్లా కలెక్టర్ అనుమతి అవసరమని అధికారులు తెలిపారు. కలెక్టర్ గ్రామాలకు అవసరమైన నీటి సరఫరా విషయంలో నిధులను మంజూరు చేసే విషయంలో జాప్యం చేయకుండా వెటనే స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

## లక్ష్మణ్ కుమార్ ఆరోపణలు అర్థరహితం

ధర్మారం మే17: రాష్ట్ర మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పై ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చేసిన ఆరోపణలు అర్థరహితమని బీఆర్ఎస్ అధ్యక్షుడు రాచూరి శ్రీధర్ అన్నారు. మండల కేంద్ర పార్టీ నాయకులతో కలిసి శ్రీధర్ శనివారం ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ మాజీ మంత్రి ఈశ్వర్ పై లక్ష్మణ్ కుమార్ చేసిన ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండించారు. మాజీ మంత్రి ఈశ్వర్ ఆరు సార్లు ప్రజల మద్దతుతో ఎమ్మెల్యేగా విజయం సాధించిన ఘనత ఆయనకే దక్కిందని పేర్కొన్నారు. పలుమార్లు ఓటమిపాలైన లక్ష్మణ్ కుమార్ మాత్రం అసెంబ్లీ ఎన్నికల్లో జనాన్ని మభ్యపెట్టి ఏడుస్తూ సానుభూతి తో ఎమ్మెల్యేగా గెలిచాడని శ్రీధర్ ఎద్దేవా చేశారు. నాలుగు సార్లు ఈశ్వర్ చేతిలో ఓడిపోయిన లక్ష్మణ్ కుమార్ ఆయనను విమర్శించడం ఎంతో విడ్డూరంగా ఉందని ఆయన పేర్కొన్నారు. మంత్రిగా ఈశ్వర్ పనిచేసిన హయాంలో పీఏలపై లక్ష్మణ్ కుమార్ ఆరోపణలు చేయటం కాదని ఆయన అన్నారు. ఈశ్వర్ ఎస్సీ, మైనారిటీ, దివ్యాంగుల, సీనియర్ సిటిజన్ శాఖలకు మంత్రిగా వ్యవహరించిన సమయంలో ఆయనకు పిఏలు అదే స్థాయిలో ఉంటూ నియమించబడ్డ డాక్టర్ లక్ష్మణ్ కుమార్ కు అవగాహన లేకపోవడం ఏంటని ప్రశ్నించారు. ఈశ్వర్, పైఏలు కమీషన్ తీసుకున్నారని ఆరోపణలు లక్ష్మణ్ నిరూపించగలరా..? అని శ్రీధర్ ప్రశ్నించారు. పిఏలపై ఆరోపణలు చేయడం ఎమ్మెల్యే లక్ష్మణ్ కుమార్ కు తగదని ఆయన స్పష్టం చేశారు. ఎమ్మెల్యే లక్ష్మణ్ కుమార్ మాజీ మంత్రి ఈశ్వర్ పై విమర్శలు పక్కనపెట్టి ధర్మపురి నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి పెట్టాలని శ్రీధర్ హితవు పలికారు. అభివృద్ధికి నిధులు అందించానని, జీవోలు రావని ప్రకటించడం మినహా ఆయన చేసిందేమీ లేదు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో నిలిచిపోయిన అభివృద్ధి పనులను లక్ష్మణ్ కుమార్ ఎందుకు పూర్తి చేయడం లేదని శ్రీధర్ ప్రశ్నించారు. ధర్మపురిలో మాతా శిశు దవాఖాన, నంది మేడారం లో 30 పడకల దవాఖాన ప్రారంభం ఎందుకు ప్రారంభమైందో చూపడం లేదని ఆయన పేర్కొన్నారు. గొల్లపల్లి మండలానికి ఈశ్వర్ మంత్రిగా పనిచేసిన సమయంలో గురుకుల పాఠశాల శాశ్వత భవనం నిర్మాణానికి రూ.17 కోట్లు నిధులు మంజూరు చేయగా తానే నిధులు అందించారు చేయబడ్డానని, ప్రజలను పక్కదారి పట్టించి ఇటీవల మళ్లీ అక్కడే ఎమ్మెల్యే లక్ష్మణ్ కుమార్ శంకుస్థాపన చేయడం విడ్డూరంగా ఉందని అన్నారు. వెల్గటూరు మండలం లోని శాఖాపూర్ గ్రామంలో నీటి ఎద్దడి ఉందని గ్రామస్తులు ప్రశ్నిస్తే వారిపై పోలీస్ కేసుల బనాయింపు జరగడం ఏమిటని అన్నారు. 2018లో జరిగిన సాధారణ అసెంబ్లీ ఎన్నికల్లో అప్పటి జగిత్యాల కలెక్టర్ శరత్ పుణ్యమా అని ఈశ్వర్ ఎమ్మెల్యేగా గెలిచాడని లక్ష్మణ్ కుమార్ చేసిన ఆరోపణలు తీవ్రంగా ఖండిస్తున్నట్లు శ్రీధర్ పేర్కొన్నారు. లక్ష్మణ్ కుమార్ వేసిన పిటిషన్ పై హైకోర్టు విచారణ జరిపి ఈశ్వర్ ఎమ్మెల్యే విజయం సరైందేనని హైకోర్టు తీర్పును ఇవ్వగా లక్ష్మణ్ కుమార్ సమీక్ష అనుచిత చేయడం ఎంతవరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు. ఎస్సీ అగ్రికల్చరల్ కాలేజీని వెల్గటూర్ మండలం స్తంభంపెల్లికి తీసుకొచ్చినట్టు ఈశ్వర్ జీవో తీసుకు రాలేదనే నవాల్ పై లక్ష్మణ్ కుమార్ నిలబడాలని ఆయన అన్నారు. పేర్కొన్నారు. అగ్రికల్చరల్ కళాశాల రాకపోతే ప్రభుత్వం అడ్మిషన్ల కోసం నోటిఫికేషన్ ఎందుకు విడుదల చేసిందో లక్ష్మణ్ కుమార్ ప్రజలకు చెప్పాలని శ్రీధర్ డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన తర్వాత సంవత్సరం సివరేజ్ ప్లాంట్ ఏర్పాటు, డిగ్రీ కళాశాల, నవంబర్ డివిజన్, ఏర్పాటు బస్సు డిపో ఏర్పాటు ఎందుకు ఏర్పాటు చేయలేదని ఆయన ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికల ముందు చెగ్యాం ముంపు బాధితులకు రూ.18 కోట్ల బీఆర్ఎస్ ప్రభుత్వం పరిహారం అందించగా దానిని తానే అందించానని లక్ష్మణ్ కుమార్ చెప్పుకోవడం హాస్యాస్పదంగా. కాంగ్రెస్ పార్టీ దళితులకు సముచిత స్థానం కల్పిస్తుందని అంటున్న లక్ష్మణ్ కుమార్ కాళేశ్వరం లో జరుగుతున్న సరస్వతి పుష్కరాల సందర్భంగా ప్రొటోకాల్ పాటించకుండా పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణను అవమానించిన దానిపై సమాధానం చెప్పాలని అన్నారు. ఇకనైనా ఈశ్వర్ పై లక్ష్మణ్ కుమార్ విమర్శలు చేయడం మానుకొని హుందాగా వ్యవహరించాలని శ్రీధర్ హితవు పలికారు. ఈ సమావేశంలో మేడారం సింగిల్ విండో చైర్మన్ ముత్యాల బలరాంరెడ్డి, వైస్ చైర్మన్ సామంతుల రాజమల్లయ్య, సర్పంచుల ఫోరం మాజీ మండల మాజీ అధ్యక్షుడు పూస్కురు జితేందర్ రావు, ఏఎంసి మాజీ చైర్మన్ గుర్రం మోహన్ రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ కోమటిరెడ్డి మల్లారెడ్డి , మండల పరిషత్ మాజీ కో ఆప్షన్ సభ్యుడు ఎండి రఫీ, ఎంపీటీసీల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు మిట్ట తిరుపతి, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కూరపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు నాడెం శ్రీనివాస్, పార్టీ అనుబంధ శాఖ మండల అధ్యక్షులు దేవి నలినీకాంత్ దేవి వంశీకృష్ణ , పార్టీ నాయకులు ఏగ్గెల స్వామి, కోమటిరెడ్డి మల్లారెడ్డి, ఐత వెంకటస్వామి, కాంపల్లి చంద్రశేఖర్, ఆవుల లత, రెడపాక శ్రీనివాస్, గంధం నారాయణ, ఆవుల శ్రీనివాస్, ఆవుల వేణుగోపాల్, దీటి శ్రీనివాస్, గంధం తిరుపతి, సాయిరి కుమార్, రాగుల చిన్న మల్లేశం, పాలమాకుల తిరుపతిరెడ్డి, బొలిశెట్టి సుధాకర్, దేవి రాజారాం, నేరెళ్ల చిన్న లచ్చయ్య, పుట్ట తిరుపతి జరిగింది.

## కన్ఫ్యూజన్ లో కాంగ్రెస్..

న్యూఢిల్లీ,పహల్గాం ఉగ్రదాడి మొదలు కాంగ్రెస్ పార్టీ ఆచారానికి భిన్నంగా ఆచి చూచి అడుగులు వేస్తూ వచ్చింది. వ్యూహాతంకంగా పావులు కదిపింది. అక్కడ ఇక్కడ ఒకటి రెండు అపశ్రుతులు వినిచ్పించినా.. అందరిదీ ఒకటే మాట అన్నట్లుగా ప్రభుత్వానికి అండగా, ఒకే మాటపై నిలిచింది. ఆపరేషన్ సిందూర్ విషయంలోనూ, అనంతర పరిణామాల విషయంలో ప్రభుత్వానికి సంపూర్ణ సహకారం అందించింది. ప్రభుత్వం తీసుకునే ఎలాంటి చర్యకైనా కాంగ్రెస్ మద్దతు ఉంటుందని పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ అగ్రనాయకుడు,లోక్ సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, ఇతర నాయకులు ప్రకటించారు. నిజానికి పహల్గాం ఉగ్రదాడి జరిగిన వెంటనే కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) పహల్గామ్ దాడిని ఖండిస్తూ ఒక తీర్మానాన్ని ఆమోదించింది. సరిహద్దు ఉగ్రవాదానికి మద్దతుగా నిలిచిన పాకిస్తాన్‌కు తగిన గుణ పాఠం చెప్పవలసిన సమయం ఆసన్నమైందని తీర్మానంలో పేర్కొంది. అలాగే.. ప్రభుత్వం తీసుకునే ప్రతి చర్యకు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఉంటుందని తీర్మానంలో పేర్కొంది. కేవలం తీర్మానం చేయడం మాత్రమే కాదు, ఆచరణలోనూ నిబద్ధత చూపింది. 26 మంది పర్యాటకులను పొట్టన పెట్టుకున్న పహల్గాం దాడి సంఘటనలో భద్రతా లోపాలు వంటి వైఫల్యాల విషయంలో ప్రభుత్వాన్ని నిలదీసే అవకాశం ఉన్నా, కాంగ్రెస్ పార్టీ విజ్ఞత చూపింది. సమన్వయంతో వ్యవహరించింది. ఇతర ప్రతిపక్ష పార్టీలు కూడా కాంగ్రెస్ పార్టీని అనుసరించాయి. అంతవరకు అంతా బాగుంది. అయితే.. ఎప్పుడైతే కాల్పుల విరమణ అంశం తెరపైకి వచ్చిందో, అక్కడి నుంచి కథ అడ్డ తిరిగింది. ముఖ్యంగా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అతి ఉత్సాహంతో చేసిన ప్రేలాపనలు కాంగ్రెస్ పార్టీకి ప్రభుత్వం పై విరుచుకు పడేందుకు అస్త్రాన్ని అందిచాయి. ఇక అక్కడి నుంచి కథ మారింది. కాంగ్రెస్ గొంతు సవరించుకుని ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ప్రారంభించింది. ఇండియా కూటమి పార్టీలు అదే దారిలోకి వచ్చాయి. కాల్పుల విరమణ ఒప్పందంలో అమెరికా పాత్ర ఏమిటని నిలదీశాయి. అమెరికా విదేశాంగ శాఖ మంత్రి మార్కో రుబియో, భారత్–పాకిస్థాన్ దేశాలు తటస్థ ప్రదేశంలో విభిన్న అంశాలపై విస్తృత స్థాయి చర్చలకు అంగీకరించాయని చేసిన ప్రకటనపై కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

# హద్దులు మీరిన సోదర ప్రేమ



న్యూఢిల్లీ,ఓవైపు మిత్రదేశం, మరో వైపు సోదరదేశం. ఈ రెండింటిలో దేనిని ఎంచుకోవాలనే మీమాంస ఎదురైతేసాధారణంగా సోదర దేశానికే ఓటు వేయడం కద్దు. ప్రస్తుతం టర్కీ చేస్తున్నదదే. 'పాకిస్తాన్ నా రెండో ఇల్లు, పాక్ ప్రజలు నా సోదరులు' అంటూ సందర్భం వచ్చిన ప్రతిసారీ తన ప్రేమాభిమానాలను చాటుకునే ఆ దేశాధ్యక్షుడు ఎర్డోగాన్ భారత్ తో నెలకొన్న ప్రస్తుత సంక్షోభ సమయంలో పాకిస్తాన్ వైపే నిలబడటంలో ఆశ్చర్యమేముంది? ఆయన మాటల్లో చెప్పాలంటే భారత్ తమకు మిత్రదేశమైతే, పాకిస్తాన్ సోదరదేశం. భారత్–పాక్ సంక్షోభంలో పశ్చిమాసియాలో ఏ దేశమూ పాకిస్తాన్ వైపు కన్నెత్తి చూడకపోగా, ఒక్క టర్కీ మాత్రమే ఆ దేశంతో అంటకాగడానికి కారణాలు అనేకం. ఇందులో ప్రధానమైనవి దౌత్య, వాణిజ్య సంబంధాలు. భారత్, టర్కీల మధ్య దౌత్య సంబంధాలు 1948లోనే మొదలైనా, ఇన్నేళ్లలో ఇరు దేశాల మధ్య సాన్నిహిత్యం పెరగకపోగా వాణిజ్య బంధం కూడా అంతంతమాత్రంగానే ఉంది. ప్రచ్ఛన్న యుద్ధ సమయంలో టర్కీ అమెరికా పంచన చేరగా, భారత్ మాత్రం అలీన విధానాన్నే నమ్ముకుంది. 1988లో అప్పటి ప్రధాని రాజీవ్ గాంధీ టర్కీలో పర్యటించాక, ఇరు దేశాల మధ్య సంబంధాలు కాస్త బలోపేతమైనా, సాన్నిహిత్యం మాత్రం పెరగలేదు. ఎనిమిదేళ్ల క్రితం టర్కీ అధ్యక్షుడు ఎర్డొగాన్ భారత్ లో పర్యటించిన దరిమిలా, 2019లో ప్రధాని మోడీ టర్కీ పర్యటనకు సిద్ధమయ్యారు. కానీ, ఐక్యరాజ్య సమితిలో ఎర్డోగాన్ ప్రసంగం భారత్ కు వ్యతిరేకంగా ఉండటంతో మోడీ తన ఆలోచనను విరమించుకున్నారు. రెండేళ్ల క్రితం భారీ భూకంపం టర్కీని కుదిపివేసిన సమయంలో భారత్ స్వచ్ఛందంగా ముందుకొచ్చి 'ఆపరేషన్ దోస్త్' పేరిట ఆ దేశంలో సహాయ, పునరావాస కార్యక్రమాలకు చేయూతనిచ్చింది. ఇందుకు భారత్ లో అప్పటి టర్కీ రాయబారి హర్షం వ్యక్తం చేస్తూ ఇరు దేశాల మధ్య ఉన్న స్నేహ సంబంధాలను ఈ ఆపరేషన్ ప్రతిబింబించిందని, స్నేహితులు ఒకరికొకరు సాయం చేసుకోవడం రివాజేనని వ్యాఖ్యానించారు. కానీ రెండింటిలో ఒకదానిని ఎంచుకోవలసి వస్తే మాత్రం టర్కీ ఓటు పాకిస్తాన్ కే. ఎందుకంటే, ఇరు దేశాల మధ్య వ్యాపార, వాణిజ్య బంధాలు ఏళ్లతరబడి పెనవేసుకుపోయాయి. ముఖ్యంగా టర్కీనుంచి పాకిస్తాన్ భారీయెత్తున ఆయుధాలు కొనుగోలు చేస్తోంది. ఐదేళ్ల క్రితం 1.5 బిలియన్ డాలర్ల విలువైన ఆయుధ సంపత్తి కొనుగోలుకు పాక్ ఒప్పందం కుదుర్చుకుంది. అదే ఏడాది మరో 30 యుద్ధ హెలికాప్టర్ల కొనుగోలుకు కూడా ఒప్పందం ఖరారైనా, అమెరికా జోక్యంతో నిలిచిపోయింది. ఇక గతంలో పాకిస్తాన్ కుటర్కీ ఫాల్కన్ జెట్ విమానాలు, క్రూయిజ్ క్షిపణులను విక్రయించడంతోపాటు అగస్టా 90 జలాంతర్గాముల ఆధునీకరణలో చేయూత అందిస్తోంది. మరోవైపు ఈ రెండు దేశాలూ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇస్లామిక్ కో ఆపరేషన్ లో సభ్య దేశాలు కావడంతో మతపరంగానూ రెండింటిమధ్య విడదీయరాని బంధం పెనవేసుకుంది. టర్కీ అధ్యక్షుడు ఎర్డోగాన్ సహజంగా భారత్ వ్యతిరేకి. అంతర్జాతీయ వేదికలపై ఆయన కశ్మీర్ విషయంలో దాయాది దేశాన్ని వెనకేసుకు రావడం తెలిసిన విషయమే. తాజా సంక్షోభంలో ఆయన పహల్గాం సంఘటనను ఖండించకపోగా, పాక్ వాదనకే వత్తాసు పలికారు. పాక్ పై భారత్ దాడి చేస్తుందని గ్రహించిన వెంటనే తమ యుద్ధ నౌకను కరాచీ పోర్టుకు పంపడంతోపాటు ఆయుధ సామగ్రిని విమానంలో పాక్ కు చేరవేశారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో టర్కీ పంపిన డ్రోన్లనే పాకిస్తాన్ ప్రయోగించినట్లు భారత సైన్యం ధ్రువీకరించింది కూడా. యుద్ధ సమయంలో సోదరదేశానికి అండగా నిలబడటంలో తప్పు లేదు గానీ, ఉగ్రవాదానికి ఆజ్యం పోస్తున్న పాకిస్తాన్ వంటి దేశాన్ని వెనకేసుకురావడం ముమ్మాటికీ సహించరాని విషయం. ఇందుకు ప్రతిగా భారత్ ఆ దేశంతో వాణిజ్య బంధాన్ని తెగతెంపులు చేసుకోవడానికి నిర్ణయించడం ఎంతైనా సముచితం. ప్రభుత్వానికి మద్దతుగా వ్యాపార, వాణిజ్య, విమానయాన సంస్థలన్నీ ఒక్కతాటిపైకి వచ్చి, 'బ్యాన్ టర్కీ' పేరిట ఆ దేశం నుంచి దిగుమతయ్యే వస్తువుల విక్రయానికి నిరాకరించడం విశేషం. పర్యాటకం ప్రధాన వనరైన టర్కీకి భారత పర్యాటకుల ద్వారా అధికాదాయం సమకూరుతోంది. గత ఏడాది టర్కీకి వెళ్లిన భారత పర్యాటకుల సంఖ్య మూడు లక్షల పైచిలుకే. ఉగ్రవాదానికి ఊతమిచ్చే ఏ దేశానికైనా దీటుగా జవాబివ్వాలన్న భారత నిర్ణయాన్ని ప్రతి ఒక్కరూ స్వాగతించాల్సిందే. ఇలాంటి సమయంలో టర్కీకి ప్రత్యామ్నాయంగా మధ్యదరా సముద్ర ప్రాంతంలో గ్రీస్, సైప్రస్ దేశాలతో దౌత్య, వాణిజ్య బంధాలను బలోపేతం చేసుకోవడం ద్వారా భారత్ ముందడుగు వేయాల్సిన అవసరం ఉంది.

# 'కారు' కోసం ఆ ముగ్గురి పోరు

హైదరాబాద్,తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక బహుశా 2016లో భారత రాష్ట్ర సమితి నాయకురాలు కల్వకుంట్ల కవిత ఒక తెలుగు న్యూస్ ఛానల్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కేసీఆర్ రాజకీయ వారసుడు ఎవరని అడిగితే ఇంకెవరు రామన్నే అని చెప్పారు. దాదాపు పదేళ్లు గడిచిపోయిన తర్వాత ఇప్పుడు ఆ పరిస్థితి తారుమారు అయినట్టు కనిపిస్తున్నది. తన కుమారుడి డిగ్రీ పట్టా ప్రదానోత్సవంలో పాల్గొనేందుకు కవిత అమెరికా విమానం ఎక్కుతున్న సమయంలో తెలంగాణ రాజధానిలో పెద్దయెత్తున చర్చ జరుగుతున్నది..కవిత కొత్త పార్టీ పెడతారా, తండ్రిని ధిక్కరించి టిఆర్ఎస్ నుంచి బయటకు వస్తారా అని. పదేళ్ల కాలంలో ఎందుకు ఇంత మార్పు వచ్చింది? గత మాసంలో భారత రాష్ట్ర సమితి రజతోత్సవం సందర్భంగా ఆ పార్టీ కార్యాధ్యక్షుడు కేటీఆర్ పలు టీవీ చానళ్ళకు ఇచ్చిన ఇంటర్వ్యూలలో 'తెలంగాణ రాష్ట్రం సాధిస్తే చాలు ఇంకేమీ అవసరం లేదు అనుకున్నాను, మంత్రి పదవి కూడా ఆశించలేదు, నేను అమితంగా వ్యతిరేకించే కాంగ్రెస్ లో గనుక ఆనాడు మా నాయన టిఆర్ఎస్ ను విలీనం చేసి ఉంటే రాజకీయాల్లో కూడా ఉండేవాడిని కాను. ఆ మాట సోనియాగాంధీకి కృతజ్ఞతలు చెప్పడంకోసం ఆమె నివాసంలోకి వెళుతుండగానే హరీశ్ రావుకు, నా భార్యకు స్పష్టంగా చెప్పాను' అన్న కేటీ రామారావు ఇప్పుడు ఎందుకు కేసీఆర్ ఏకైక వారసుడిగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారని చర్చ జరుగుతున్నది. అధికారంలో ఉన్నప్పుడే భారత రాష్ట్ర సమితిలో కెసిఆర్ వారసత్వంకోసం మూడు స్తంభాలాట మొదలయింది. కేటీ రామారావు, హరీశ్ రావు, కవిత మధ్య పొరపొచ్చాలకు సం బంధించిన వార్తలు మీడియాకు మృష్టాన్న భోజనం అయిన విషయం తెలిసిందే. అయితే దాదాపు అన్ని సందర్భాల్లో ముగ్గురూ 'కేసీఆరే మా నాయకుడు, మేమంతా ఆయన విధేయులం' అని చెబుతూ వచ్చినా తాజా పరిస్థితి మాత్రం ఆ ముగ్గురి అంతరంగాలను ఆవిష్కరిస్తున్నట్టే కనిపిస్తున్నది. నిన్న మొన్నటిదాకా 'కేసీఆర్ నాయకుడు.. ఆయన నేతృత్వంలోనే నేను ఒక సైనికుడిగా పని చేస్తాను' అని చెబుతూ వచ్చిన మాజీ మంత్రి, పార్టీలో ట్రబుల్ షూటర్ గా పేరున్న సీనియర్ నాయకుడు హరీశ్ రావు హఠాత్తుగా కేటీ రామారావుకు నాయకత్వం అప్పగించినాసరే, కెసిఆర్ ఆదేశాలమేరకు ఆయన కింద కూడా పనిచేయడానికి తాను సిద్ధమని చెప్పడం పెద్ద చర్చకు దారి తీసింది. పార్టీకి విధేయుడు, మరీ ముఖ్యంగా నాయకుడిపట్ల అపారమైన భక్తిప్రపత్తులు కలిగిన హరీశ్ రావు ఎందుకు స్వరం మార్చినట్టు? దీని వెనుక మతలబు ఏమిటి? అని చర్చ జోరందుకున్న సమయంలో కేటీ రామారావు స్వయంగా హరీశ్ రావు ఇంటికి వెళ్లి దాదాపు మూడు గంటలపాటు సమాలోచనలు జరపడం మరింత చర్చనీయాంశం అయింది. వారి మధ్య జరిగిన సంభాషణ ఏమిటన్నది ఊహకు అందని విషయం ఏమీ కాదు. కేసీఆర్ వారసుడిగా ఆయన కుమారుడే ఉంటాడు అనడానికి, అధినాయకుడు కూడా అదే కోరుకుంటాడు అనడానికి నిదర్శనంగా ఇప్పటికే కొన్ని సంఘటనలు జరిగాయి. 2018 ఎన్నికల తర్వాత కేసీఆర్ త్వరలో కేటీఆర్ ని ముఖ్యమంత్రిగా ప్రకటించబోతున్నారనే వార్తను పార్టీలోని రెండవ శ్రేణి నాయకులు, కార్యకర్తలు ప్రజల స్పందనకోసం ప్రచారంలోకి తెచ్చారు. దానికి సరైన స్పందన రాకపోగా కొంత వ్యతిరేకత ఉందని గ్రహించిన కేసీఆర్ మళ్ళీ తానే దాన్ని సరిదిద్దుకుంటూ 'నేను ఉన్నంతకాలం నేనే ముఖ్యమంత్రిని, నేనే నాయకుడిని' అని చెప్పుకున్నారు. ఇప్పుడు ప్రతిపక్షంలోకి వచ్చాక గత మాసంలో రజతోత్సవ వేడుకల సందర్భంగా కూడా కేటీ రామారావే పార్టీ తదుపరి నేత అనే సంకేతాలు వెళ్లేట్టుగా సంఘటనలు జరిగాయి. తొలుత హరీశ్ రావుకి ఉత్సవాల నేతృత్వ బాధ్యతలు అప్పగించిన కేసీఆర్ మధ్యలో మనసు మార్చుకుని ఆ బాధ్యతను పూర్తిగా కేటీ రామారావు అప్పగించినట్టుగా బయటకు కనిపించే విధంగా పరిణామాలు మారుతూ వచ్చాయి. రజతోత్సవ వేడుకల వేదిక మీద కూడా కెసిఆర్ తన కుమార్తె కవితకుగానీ, హరీశ్ రావుకుగానీ ప్రాధాన్యత లేకుండా చేయడం చర్చనీయాంశం అయింది. అయినా కెసిఆర్ ఇంకా క్రియాశీలక రాజకీయాల్లో ఉండగానే ఎందుకని వారసత్వ చర్చ వస్తున్నది? ఇటీవల ఆయన కొడుకు, కూతురు ఇద్దరూ రాజకీయ సంబంధమైన కార్యక్రమాల లో పాల్గొన్నప్పుడు వారి మద్దతుదారులు 'సీఎం సీఎం' అంటూ నినదించినా అగ్రనాయకుడు ఉండగా అలా కోరుకోవడం సరైనది కాదని నివారించినట్టుగా కనిపించదు. మొన్నటికి మొన్న ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం రామానుజపురం శివారులో నాంచారమ్మ కల్యాణానికి హాజరై ప్రత్యేక పూజలు జరిపిన



కవిత అక్కడ నాంచారమ్మ అమ్మవారి వేషధారణలో వచ్చిన బాలికలతో సోది చెప్పించుకున్నారు. 'భవిష్యత్తులో మీరే తెలంగాణకు ముఖ్యమంత్రి అవుతార'ని చిన్నారులు అనడంతో ఆ మాటలను కవిత చిరునవ్వుతో ఆలకించారు కానీ వారించే ప్రయత్నం ఏమి చేయలేదు. ఇటీవలి కాలంలో కవిత హాజరవుతున్న పలు సభల్లో ఆమెను ఉద్దేశించి గుంపులో నుండి 'సీఎం సీఎం' అనే నినాదాలు వినిపించినా ఆమె ఆక్షేపించలేదు. ఇదే పరిస్థితి కేటీ రామారావు సభల్లో కూడా కనిపిస్తుంది. పోరాడి రాష్ట్రం సాధించిన నాయకుడు ఇంకా ఆరోగ్యంగా ఉండగా,రాజకీయాల్లో క్రియాశీలకంగా ఉండగా ఈ నినాదాలు ఏమిటని గట్టిగా మందలించింది లేదు. ఇక్కడ ఒక పోలిక తీసుకురా వచ్చు. వైయస్ రాజశేఖర్ రెడ్డి చనిపోయిన తర్వాత ఎన్నో ఏళ్లకు తాను ఆయన వారసురాలిని అంటూ, ముఖ్యమంత్రిని అవుతానంటూ ఆయన కూతురు షర్మిల బయలుదేరారు. తన సోదరుడు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ఆనాడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్ జగన్మోహన్ రెడ్డి తనకు రాజకీయంగా, ఆర్థికంగా కూడా ఇవ్వవలసినంత భాగస్వామ్యం ఇవ్వనందుకు ఆమె అలిగి బయటకు వచ్చి రాజకీయాలు చేసే ప్రయత్నం చేశారు. సొంత పార్టీ పెట్టి ఘోరంగా విఫలమై, కాంగ్రెస్ పార్టీ లో చేరి ఆంధ్రప్రదేశ్ లో ఆ పార్టీ అధ్యక్షురాలుగా పని చేస్తున్నారు. అక్కడ ఇవన్నీ వైయస్సార్ మరణానంతరం జరిగా యి. ఇక్కడ కేసీఆర్ క్రియాశీలకంగా ఉన్న కాలంలోనే కవిత తిరుగుబాటు ధోరణి ప్రదర్శి స్తున్నారంటే సహజంగానే చర్చ జరుగుతుంది. రామన్నే కేసీఆర్ వారసుడు అన్న దగ్గరనుండి రాజకీయ వారసత్వంలో వాటా కోరుకునే వరకు లేదా వారసు రాలిని కావాలని కోరుకునేవరకు కవితలో వచ్చిన మార్పు ల వెనక కారణాలు ఉన్నాయి. తెలంగాణ ఉద్యమ సమయం లో కేసీఆర్ సంతానమిద్దరూ హరీశ్ రావు తర్వాతనే రాజకీయ రంగ ప్రవేశం చేశారు. ఉద్యమ సమయంలో తెలంగాణ జాగృతి పేరిట పార్టీ కార్యక్రమాలకు ఆమె కొంత ఊపునిచ్చిన మాట వాస్తవం. అందుకు ప్రతిఫలంగా నిజామాబాద్ నుంచి లోకసభ సభ్యురాలు గాఎన్నికై రెండవ పర్యాయం స్వయంకృతాపరాధంవల్ల ఓడిపోయారు. అయినా నాయకుడు ఆమెను శాసనమండలికి పంపించిన విషయం తెలిసిందే. అయితే ఇటీవలి కాలంలో ముఖ్యంగా ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో నిందితురాలిగా తీహార్ జైలుకు వెళ్లి వచ్చిన తరువాత కొన్ని మాసాలకు తిరిగి ప్రజల్లోకి వచ్చి వివిధ విషయాల మీద మాట్లాడుతున్న కవిత పార్టీలో తనకు అన్యాయం జరుగుతున్నదనే భావనలో ఉన్నారు. అది పలుమార్లు ఆమె నోటనే బయటపడింది కూడా. నిజానికి ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో తాను ఆరు మాసాలు జైలుకు వెళ్లి వచ్చినా పార్టీ అగ్రనాయకత్వంనుండి సరైన స్పందన లేదని అభిప్రాయంతో ఉన్నారు. ఆ మేరకు ఆమె పార్టీ పరిణామాలపట్ల, తనపట్ల పార్టీ వ్యవహరిస్తున్న తీరు విషయంలో కూడా అసంతృప్తి వ్యక్తం చేస్తూ తండ్రికి లేఖ రాసినట్టుగా చర్చ జరుగుతున్నది. లేఖలో ఏమున్నది అనే విషయం మనకు తెలియకపోయినా కొన్ని సందర్భాలలో ఆమె తన అభిప్రాయాన్ని బహిరంగంగా ప్రకటించడం పార్టీ నాయకత్వానికి.. ముఖ్యంగా పదేళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్ కు, ఆయన వారసుడిగా ప్రచారంలో ఉన్న కేటీ రామారావుకు కొరుకుడు పడని విషయాలన్నది స్పష్టం. 'భౌగోళిక తెలంగాణ సాధించుకున్నాం కానీ సామాజిక తెలంగాణ కోసం ఇంకా పోరాడాల్సి ఉంది' అని కవిత బహిరంగంగా మాట్లాడ డం అంటే తన తండ్రి పాలనలో వివిధ వర్గాల ప్రజలకు సామాజిక న్యాయం జరగలేదని భావిస్తున్నట్టే కదా. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులగణన కార్యక్రమాన్ని పార్టీ బహిష్కరించినా, కేసీఆర్ సహా నాయకులెవరూ అందులో పాల్గొనకపోయినా కవిత అందులో పాల్గొనడం నాయకత్వానికి కంటగింపుగానే కనిపించింది.

## జల్సాలకు అలవాటు పడి మోసాలు

విజయవాడ,చాలామంది పేకాట, బెట్టింగ్ లో డబ్బులు పోగొట్టుకొని అప్పుల పాలవుతున్నారు. అప్పుల ఊబిలో కూరుకుపోయిన కొందరు ఆత్మహత్యలకు పాల్పడుతుండగా.. మరికొందరు ఈజీ మనీ కోసం అడ్డదారులు తొక్కుతున్నారు. పేకాట, ఆన్‌లైన్ బెట్టింగ్, మద్యంకు బానిసైన ఓ వ్యక్తి కార్లు రెంటు–కు తీసుకొని.. యజమానులకు టోకరా వేశాడు. ఈఘటన విజయవాడలో చోటు–చేసుకుంది. అప్పుల ఊబిలో కూరుకుపోయిన కొందరు ఆత్మహత్యలకు పాల్పడుతుండగా.. మరికొందరు ఈజీ మనీ కోసం అడ్డదారులు తొక్కుతున్నారు. పేకాట, ఆన్‌లైన్ బెట్టింగ్, మద్యంకు బానిసైన ఓ వ్యక్తి కార్లు రెంటుకు తీసుకొని.. యజమానులకు టోకరా వేశాడు. ఈఘటన విజయవాడలో చోటు–చేసుకుంది. ట్రావెల్స్ తిప్పే యజమానులను సాయిరాం టార్గెట్ చేశాడు. సాయిరాం విజయవాడలోని పలు ప్రాంతాల్లో కార్ రెంటుకు తీసుకుని.. మొదట్లో ఒకటి, రెండు అద్దెలు కరెక్టుగా ఇచ్చేవాడు. నమ్మకం కుదిరాక పది రోజులు ఊరు వెళ్తున్నాను అని చెప్పి.. కార్లు తీసుకెళ్లి వేరే వేరే ప్రాంతాల్లో తాకట్టు– పెట్టేవాడు. వచ్చిన డబ్బుతో జూదాలు ఆడేవాడు. విజయవాడ పెనమలూరులో నివాసం ఉంటున్న కుందేటి సాయిరాం అనే వ్యక్తి పేకాట, ఆన్ లైన్ బెట్టింగ్ సహా మద్యంకు బానిసయ్యాడు. విజయవాడ కుమ్మరి పాలెం ప్రాంతానికి చెందిన కళ్యాణ్ అనే ట్రావెల్స్ యజమాని దగ్గర మార్చి 13వ తారీఖున మారుతి స్విఫ్ట్ డిజైర్ కారును సాయిరాం అద్దెకు తీసుకున్నాడు. కారు ఇంతకీ తిరిగి ఇవ్వకపోవడంతో.. ట్రావెల్స్ యజమాని కళ్యాణ్ భవానిపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో భాగంగా పడమట, పెనమలూరు పోలీసు స్టేషన్లలో కూడా కేసులు నమోదైనట్లు– తేలింది. విజయవాడలో పలు ప్రాంతాల్లో కార్లు రెంటు–కు తీసుకొని రూ.50 లక్షల టోకరా వేశాడని తెలిసింది. పోలీసులు సాయిరాం కోసం గాలిస్తున్నారు.

## రక్తనిధి నిల్వలో నిర్లక్ష్యం తగదు

విజయవాడ, సురక్షితమైన రక్తం అందుబాటులో ఉండేలా చూడడానికి, జిల్లాకొక ప్రభుత్వ రక్త నిధి కేంద్రం స్థాయి పెంచడం ద్వారా నాణ్యమైన సేవలందించాలని సిఫార్సు చేసినా ఫలితం లేకుండా పోయింది. ఇప్పటి వరకు జిల్లాలో అలాంటి రక్త నిధుల ఏర్పాటు అంతంతమాత్రంగానే ఉన్నాయి. రక్తం సేకరించిన తేదీ, దాతపేరు, చిరునామా, వయస్సు, బరువు, హిమోగ్లోబిన్ శాతం, రక్తం గ్రూపు మొదలైన అంశాలను సూచిస్తూ రక్తదాతల రిజిస్టర్‌ను రక్త నిధి కేంద్రాలు నిర్వహించాలి. ఆరోగ్యంగా ఉండి రక్తదానానికి ఒప్పుకున్న దాత నుంచి మాత్రమే రక్తం సేకరించినట్టు సంచులపై సూచికలు అతికించాలి. అంతేకాక నిర్ణీత ప్రమాణాలు లేని రక్త నిల్వలను నాశనం చేసేందుకు, రక్తమార్పిడి ద్వారా అంటురోగాలు ప్రబలకుండా చూసేందుకు ఇది దోహద పడుతుంది. దీనివల్ల రోగులకు అనుకూలంకాని రక్తం ఇచ్చే ప్రమాదం ఉండదు. జిల్లాలోని రక్త నిధి కేంద్రాలను కలుపుకుని రక్త నిధులన్నింటిలోనూ సేకరించిన రక్తపు యూనిట్లు–, నిర్ణీత గడువులోగా ఉపయోగించకపోవడం వల్ల పడేయాల్సి వస్తోందని ఆడిట్ అధ్యయనంలో తేలింది. రక్తానికి బదులు కచ్చితం గా అవసరమైన భాగాలను మాత్రమే ఉపయోగించడం వల్ల రక్తాన్ని సంపూర్ణంగా వినియోగించుకోవడం అవసరమని ప్రపంచ ఆరోగ్య సంస్థ స్పష్టం చేసింది.

## కాశ్మీర్ అంశమే పాక్ జీవనాడి

న్యూఢిల్లీ,ఆర్థిక పరంగానే కాదు.. పాకిస్థాన్ అన్ని విధాలుగా పతనమైన దేశమని ఆర్మీ మాజీ చీఫ్ నిర్మల్ చందర్ విజ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పాక్ అబద్ధాల పుట్ట అని.. వాళ్లను అస్సలు నమ్మొద్దని చెప్పారు. ఆ దేశాన్ని ప్రభుత్వం కాదు.. ఆర్మీనే నడుపుతోందన్నారు. అన్ని విధాలుగా పతనమైన పాక్‌ను కశ్మీర్ అంశమే ఐక్యతగా ఉంచుతోందన్నారు. అన్ని సమస్యల్ని కప్పిపుచ్చుకోవడానికి కశ్మీర్‌ను ఒక ఆయుధంగా అక్కడి నేతలు, ఆర్మీ మలచుకుందన్నారు. భారత్ ఎంత శక్తిమంతమైన దేశం, మనం ఎంత బాధ్యతాయుతంగా వ్యవహరిస్తామో మొత్తం ప్రపంచం ఇప్పుడు అర్థం చేసుకుంటోందన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత సైనికాధికారులు ఇచ్చిన ఫస్ట్ బ్రీఫింగే దీనికి సరైన ఉదాహరణ అని ఆయన మెచ్చుకున్నారు. విదేశీ వ్యవహారాల శాఖ సెక్రెటరీతో కలసి ఇద్దరు మహిళా అధికారులు మాట్లాడిన తీరు, ఆపరేషన్ సిందూర్ గురించి వివరించిన విధానం అదిరిపోయిందన్నారు. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్‌కు భారత్ చుక్కలు చూపించింది భారత్. పహల్గాం దాడి దరిమిలా టెర్రరిస్టులతో పాటు– వారికి అండగా ఉంటు–న్న శత్రుదేశంపై ఉరుములా విరుచుకుపడుతోంది. ఆపరేషన్ సిందూర్ పేరుతో ఉగ్రస్థావరాల మీద అటాక్ చేయడం, ఆ తర్వాత ప్రతిదాడులకు తెగించిన పాక్‌పై డ్రోన్లు, మిసైళ్లతో ఇండియా ఓ రేంజ్‌లో విరుచుకుపడటం ప్రపంచదేశాలు కూడా చూశాయి. తమ జోలికొస్తే తాటతీస్తామంటూ భారత్ చేసిన సింహగర్జన పాక్‌తో పాటు– ఆ దేశానికి సాయం చేస్తున్న టర్కీ, అజర్‌బైజాన్, చైనాకూ వెన్నులో వణుకు పుట్టిస్తున్నాయి. యుద్ధంతోనే కాదు దౌత్యంతోనూ పాక్‌ను ఇబ్బందులపాలు చేస్తోంది ఇండియా. వాళ్ల అసలు రూపాన్ని ప్రపంచ దేశాల ముందు బయటపెట్టేందుకు సిద్ధమవుతోంది. ఈ సమయంలో భారత ఆర్మీ మాజీ చీఫ్ నిర్మల్ చందర్ విజ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కశ్మీరే పాక్ ఆయుధమని అన్నారు.

## నకిలీ మద్యం విక్రయం

హైదరాబాద్,: నగరంలో జోరుగా నకిలీ మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. మొన్నటికి మొన్న ఒక బార్ యాజమాన్యం నకిలీ మద్యం విక్రయిస్తూ పట్టుబడిన విషయం మరవక ముందే తాజాగా రాజేంద్రనగర్, కాటేదాన్‌లో మరో నకిలీ మద్యం సరఫరా ముఠా గుట్టును ఆబ్కారీ పోలీసులు రట్టు చేసిన విషయం తెలిసిందే. ధనార్జనే ధ్యేయంగా నగరంలో ఇలాంటి కొందరు బార్ల నిర్వాహకులు కల్తీ మద్యం విక్రయాలకు విక్రయిస్తున్నట్లు వారి ట్రూప్స్ బార్ ఘటనతో మరోసారి రుజువైంది. ఈ తరహా కల్తీ మద్యం విక్రయాలు హైదరాబాద్,రంగారెడ్డి, జిల్లాల పరిధిలో చాలా బార్లలో జరుగుతున్నట్లు మద్యం ప్రియులు ఆరోపిస్తున్నారు. బార్లలో మద్యం తాగుతున్నప్పుడు కర్ర నాణ్యతపై అనుమానం కలిగిస్తే నిర్వాహకులు దౌర్జన్యాలు దిగడం, దాడులకు పాల్పడడం వంటి చర్యలకు దిగడం మద్యం ప్రియులు ఆరోపిస్తున్నారు. మరోపక్క గ్రేటర్, శివారు ప్రాంతాల్లో ఉన్న కొన్ని బార్లలో మొదటి ఒకటి రెండు పెగ్గులు సరిగ్గా పోసినా, ఆ తరువాత పెగ్గులన్నీ కల్తీనే అనే వాదనలు వినిపిస్తున్నాయి. అయితే మద్యం మాఫియాలు ధనార్జన కోసం విక్రయించే కల్తీ మద్యం వల్ల మద్యం ప్రియుల ఆరోగ్యానికి ముప్పు తప్పదంటున్నారు వైద్యనిపుణులు. కల్తీ మద్యం వల్ల కొన్ని సార్లు ప్రాణాలు కూడా పోయే ప్రమాదం లేకపోలేదని హెచ్చరిస్తున్నారు. ఇదిలా ఉండగా బార్ లైసెన్స్‌ను రెన్యువల్ చేయించుకోకపోవడమే కాకుండా కల్తీ మద్యం దందాదారు ట్రూప్స్ బార్ అండ్ రెస్టారెంట్ ఓ యూత్ కాంగ్రెస్ నాయకుడిగా ప్రచారం జరుగుతోంది.

ట్రూప్స్ బార్ ఘటనతో

లింగంపల్లి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిని అయ్యప్ప సొసైటీ ప్రాంతంలో ఉన్న 'ట్రూప్స్ బార్'కు లైసెన్స్‌కు సంబంధించిన నిర్వాహకులు రెన్యువల్ చేయించుకోలేదు. మద్యం డిపోల నుంచి మద్యాన్ని కూడా తీసుకోకుండానే బార్‌ను అయితే ఉన్నారు. మద్యం లేకుండా బార్‌ను ఎలా ఉంటుందనే అనుమానంతో రంగారెడ్డి జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్ జీవన్ కిరణ్ తన బృందంతో కలిసి గురువారం రాత్రి ట్రూప్స్ బార్‌పై దాడులు జరిగాయి.

# పాక్ ఆర్మీ,లష్కరే ఉగ్రవాదుల కొత్త కుట్ర.. పీఓకేలో టన్నెల్స్ నిర్మాణం..



న్యూఢిల్లీ,పాకిస్తాన్ భారత్‌కి వ్యతిరేకంగా కొత్త కుట్రలకు ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే "ఆపరేషన్ సిందూర్"తో చావు దెబ్బలు తిన్నా కూడా తన పంథాను మార్చుకోవడం లేదు.తాజాగా వస్తున్న సమాచారం ప్రకారం, పాకిస్తాన్ ఆర్మీ, లష్కరే తోయిబా ఉగ్రవాదులు పాక్ ఆక్రమిక కాశ్మీర్(పీఓకే)లోని నియంత్రణ రేఖను సందర్శించినట్లు తెలుస్తోంది.'పాకిస్తాన్ సైన్యం మరియు లష్కరే తోయిబా కమాండర్లు పాకిస్తాన్ ఆధీనంలో ఉన్న కాశ్మీర్‌లో సమావేశమై ఎల్ఓసిని సందర్శిస్తున్నారు. జిహాదీ ఉగ్రవాదులను సరిహద్దు దాటించడానికి పాకిస్తాన్ ఎల్ఓసి క్రింద సొరంగం కార్యకలాపాలను పెంచుతోందని ఇటీవలి నివేదికలు సూచిస్తున్నాయి" అని న్యూయార్క్ టైమ్స్ జర్నలిస్ట్ తహా సిద్ధిఖీ ఒక వీడియోను షేర్ చేస్తూ ఎక్స్‌లో రాశారు. అతను పంచుకున్న క్లిప్‌లో లష్కరే సహ వ్యవస్థాపకుడు అమీర్ హంజాతో పాటు ఉగ్ర సంస్థకు చెందిన అనేక మంది సభ్యులు ఉన్నారు.అయితే, హమాస్ తరహాలో పాక్ ఉగ్రవాదులు పీఓకేలో సొరంగాల తవ్వకాన్ని వేగవంతం చేసినట్లు ఇటీవలి నివేదికలు సూచిస్తున్నాయి. దీనిపై బీఎస్ఎఫ్, భారత సైన్యం కూడా అప్రమత్తంగా ఉంది. కొన్ని నివేదిక ప్రకారం, ఆపరేషన్ సిందూర్ ప్రారంభించడానికి ముందు చొరబాటుదారులు లోతైన భూగర్భ సొరంగాలను ఉపయోగిస్తున్నారని తెలిపాయి. చొరబాటుదారుల్ని, ఉగ్రవాదుల్ని భారత్ లోకి పంపించేందుకు వీటిని ఉపయోగించేందుకు పాకిస్తాన్ ప్రయత్నిస్తోంది. ముఖ్యంగా, భారత్–పాక్ సంఘర్షణల సమయంలో పాక్ ఆర్మీని ఈ సొరంగాల ద్వారా పంపించడానికి వీటిని తవ్విందా..? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# ట్రంప్ తన పంతం నెగ్గించుకుంటే.. భారత్‌కు ఏటా 18 బిలియన్ డాలర్ల నష్టం



వాషింగ్టన్,అమెరికా సంపద మొత్తం ప్రపంచదేశాలు తరలించుకుపోతున్నాయని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భావన. ఈ క్రమంలో సుంకాల ఆయుధం ప్రయోగించారు. రకరకాల కారణాలతో వెనక్కు తగ్గారు. వాణిజ్యంపై ఇప్పుడు ప్రపంచం దేశాలతో అమెరికా చర్చలు జరుపుతోంది. ఇక అమెరికాలో ఉద్యోగాలు చేసే విదేశీయులు సొంత దేశాలకు డబ్బు తరలించుకుపోకుండా మరో బిల్లు తీసుకొచ్చారు. సొంత దేశాలకు తరలించే డబ్బుపై 5 శాతం పన్ను విధించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇది కార్యరూపం దాలిస్తే భారత్‌కు నష్టం తప్పదని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనీషియేటివ్ ప్రతినిధులు తమ అధ్యయనంలో పేర్కొన్నారు.వివిధ దేశాల్లోని భారతీయులు ఏటా 120 బిలియన్ డాలర్లు భారత్‌కు రెమిటెన్స్ రూపంలో పంపిస్తున్నారు. ఇందులో అమెరికా నిధుల వాటా 28 శాతం. ఈ మొత్తంపై అమెరికా ప్రభుత్వం 5 శాతం పన్ను విధిస్తే భారత్ ఏటా 12 నుంచి 18 బిలియన్ డాలర్ల వరకూ నష్టపోవాల్సి ఉంటుంది.ఎన్నారైలు పంపించే నిధులపై ఎక్కువగా ఆధారపడే యూపీ, బీహార్, కేరళ రాష్ట్రాలపై ఈ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. అనేక కుటుంబాలు ఈ డబ్బుతోనే విద్య, ఆరోగ్యం, సొంతిళ్లు వంటి అవసరాలను తీర్చుకుంటున్నారు. ట్రంప్ ప్రకటించిన రెమిటెన్స్ సుంకం అమెరికాలోని విదేశీయులందరికీ వర్తిస్తుంది. అంటే, హెచ్–1బీ వీసాతో పాటు గ్రీన్ కార్డు పొందిన వారు కూడా భారత్‌కు డబ్బు పంపించేందుకు 5 శాతం చార్జి చెల్లించుకోక తప్పదు.ట్రంప్ ప్రవేశపెట్టిన ఈ బిల్లు అమల్లోకి వస్తే భారత ఫారెక్స్ నిల్వలపై కూడా ప్రభావం పడుతుందని నిపుణులు చెబుతున్నారు. డాలర్ల రాక పడిపోయి రూపాయి విలువ తగ్గే అవకాశం కూడా ఉందని అంటున్నారు. చివరకు కరెన్సీ స్థిరీకరణ కోసం ఆర్‌బీఐ రంగంలోకి దిగాల్సి రావొచ్చని అంచనా వేస్తున్నారు.వివిధ దేశాల మధ్య నగదు బదిలీ మరింత సరళతరం చేసేందుకు భారత్ ఇప్పటికే డబ్ల్యూటీఓ ద్వారా పలు ప్రయత్నాలు చేస్తోంది. ట్రంప్ తాజా చర్య భారత్ ప్రయత్నాలకు అడ్డంకిగా మారే అవకాశం ఉంది. ట్రంప్ చర్యల ప్రభావం మధ్యతరగతి వారిపై అధికంగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. అల్పాదాయ దేశాల్లో వస్తువులకు డిమాండ్ తగ్గే అవకాశాలు కూడా లేకపోలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# ఇప్పుడు గోవా "భోగ్ భూమి" కాదు..



గోవా:సాధారణంగా కాస్త లాంగ్ వీకెండ్ వచ్చినా, హాలిడేస్ లో బాగా ఎంజాయ్ చేయాలని భావించినా, సముద్ర తీరంలో సూర్యోదయాన్ని మరింత కొత్తగా ఆస్వాధించాలని అనుకున్నా ఎక్కువమంది యువత గోవాను ఒక బెస్ట్ ఆప్షన్‌గా ఎంచుకుంటారని అంటారు. అయితే అది ఒకప్పుడు.. ఇప్పుడు గోవా బీచ్‌ల కంటే ఎక్కువగా దేవాలయాలు, సంస్కృతి విషయంలో ఎక్కువమందిని ఆకర్షిస్తోందని అంటున్నారు సీఎం ప్రమోద్.అవును... గోవా ఒకప్పుడైతే సూర్యుడు, ఇసుక, సముద్రాన్ని ఎంజాయ్ చేస్తూ ఆనందించడానికి వచ్చేవారని అయితే.. ఇప్పుడు మాత్రం దేవాలయాలు, సంస్కృతి కోసం ఎక్కువమందిని గోవా ఆకర్షిస్తోందని.. గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ అన్నారు. ఈ సందర్భంగా గోవా ఇప్పుడు "భోగ్ భూమి" (ఆనంద భూమి) కాదు.. "యోగ భూమి" (భక్తి, యోగా భూమి), "గో మాత భూమి" (ఆవుల భూమి) అని అన్నారు.ఇదే సమయంలో... ఒకప్పుడు గోవాకు ప్రజలు వచ్చినప్పుడల్లా ఇది భోగ్ భూమిగానే అనుకునేవారు కానీ.. ఇది ఇప్పుడు యోగ భూమి అని అన్నారు. ఇక్కడ సనాతన సంస్థ ఆశ్రమం కూడా ఉందని తెలిపారు. తాజాగా "సనాతన రాష్ట్ర శంఖనాద్ మహోత్సవ్" కార్యక్రమంలో ప్రసంగించిన ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఇది పరశురాముడి భూమి అని నొక్కి చెప్పారు.ఈ సందర్భంగా... విష్ణువు అవతారమైన పరశురాముడు అరేబియా సముద్రంలోకి బాణం వేసి, దాన్ని వెనక్కి నెట్టి గోవాని సృష్టించారని ముఖ్యమంత్రి సావత్ అన్నారు! ఈ నేపథ్యంలోనే ఇప్పుడు రాష్ట్రంలోని బీచ్ ల కంటే శుభ్రమైన, అందమైన దేవాలయాలు ఎక్కువమందిని ఆకర్షిస్తున్నాయని అన్నారు. రాష్ట్రంలోని దేవాలయాలను స్థానిక సమాజాలే నిర్వహిస్తున్నాయని పేర్కొన్నారు.సనాతన్ సంస్థ వ్యవస్థాపకుడు జయంత్ అథవాలే 83వ జయంతి సందర్భంగా ప్రసంగించిన సావంత్... గతంలో ప్రజలు సూర్యుడు, ఇసుక, సముద్రం చూడటానికి గోవాను సందర్శించేవారని.. అయితే, ఇప్పుడు అది మారిందని. ఇప్పుడు పర్యాటకులు మన గొప్ప సంస్కృతి, దేవాలయాలను అనుభవించడానికి ఇక్కడికి వస్తున్నారని తెలిపారు!

# నోబెల్ ఆర్థిక నిపుణుడిని టీంలోకి తీసుకున్న రేవంత్ రెడ్డి



హైదరాబాద్,ప్రఖ్యాత ఆర్థిక శాస్త్ర నిపుణుడు, నోబెల్ అవార్డు గ్రహీత ప్రొఫెసర్ అభిజిత్ బెనర్జీ... తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో శనివారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. బంజారాహిల్స్ లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ లో జరిగిన ఈ సమావేశంలో రాష్ట్రంలో కాంగ్రెస్ సారథ్యంలోని ప్రజా ప్రభుత్వం చేపట్టిన వివిధ పథకాలు, ప్రస్తుత ఆర్థిక స్థితిగతులపై ఇరువురూ సమగ్రంగా చర్చించారు.ఈ కీలక భేటీలో ముఖ్యమంత్రితో పాటు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ తో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.రాష్ట్ర ఆర్థిక వృద్ధిని వేగవంతం చేయడం, ఆదాయ వనరులను పెంపొందించడం, ఆర్థిక క్రమశిక్షణ పాటించడం, పట్టణాభివృద్ధి, నైపుణ్యాభివృద్ధి ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం వంటి కీలక అంశాలపై చర్చ జరిగింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, శతాబ్దాల చరిత్ర ఉన్న హైదరాబాద్ నగర విశిష్టతను, ఇక్కడ తయారయ్యే ఉత్పత్తులకు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఆదరణను అభిజిత్ బెనర్జీకి వివరించారు. తెలంగాణ ప్రత్యేకతను, ఇక్కడున్న సానుకూలతలను ప్రపంచానికి చాటిచెప్పాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. మహిళా స్వయం సహాయక సంఘాల బలోపేతం, రైతుల సాధికారత, యువతకు ఉద్యోగ అవకాశాల కల్పన, స్కిల్ డెవెలప్మెంట్ దిశగా ప్రభుత్వం చేపడుతున్న విప్లవాత్మక చర్యలను ఆయన ప్రస్తావించారు.

తెలంగాణ రైజింగ్ విజన్ బోర్డులో భాగస్వామ్యానికి ఆహ్వానం:

రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ఏర్పాటు చేయనున్న తెలంగాణ రైజింగ్ విజన్ బోర్డులో భాగస్వామ్యం పంచుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. అభిజిత్ బెనర్జీని సాదరంగా ఆహ్వానించారు. భవిష్యత్తు విజన్ రూపకల్పనలో ఇతర ప్రముఖులతో పాటు తమ విలువైన అనుభవాలను, సలహాలను అందించాలని ఆయన కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దార్శనికతను ప్రశంసించిన అభిజిత్బెనర్జీ, ఈ ప్రతిష్టాత్మక బోర్డులో చేరడానికి తన అంగీకారాన్ని తెలియజేశారు.ముఖ్యంగా, పోలీస్, మున్సిపల్ శాఖల్లో ట్రాన్స్జెండర్ల నియామకం, ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న హైదరాబాద్ కోర్ అర్బన్ ఏరియాను సర్వీస్ సెక్టార్ గా అభివృద్ధి చేసే ప్రణాళిక, స్కిల్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలనే ముఖ్యమంత్రి నిర్ణయాలు ఆయన దార్శనికతకు అద్దం పట్టాయని అభిజిత్ బెనర్జీ అభినందించారు.

అభిజిత్ బెనర్జీ సూచనలు:

'భారత్ ఫ్యూచర్ సిటీ' భావనలో ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్, సృజనాత్మకతను భాగం చేయాలని అభిజిత్ బెనర్జీ సూచించారు. సంప్రదాయ చేతివృత్తుల వారిని ఆధునిక వ్యాపారవేత్తలుగా మార్చేందుకు ప్రత్యేక స్వల్పకాలిక కోర్సులు నిర్వహించాలని ఆయన అభిప్రాయపడ్డారు. అత్యాధునిక సాంకేతికత, సోషల్ మీడియా, మార్కెటింగ్ నైపుణ్యాలతో వారికి శిక్షణ ఇవ్వడం ద్వారా వారిని వృద్ధి చేయాలని ఆయన పేర్కొన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దార్శనికతను ప్రశంసించిన అభిజిత్ బెనర్జీ, రాష్ట్ర ఆర్థిక ప్రగతికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ భేటీతో తెలంగాణ అభివృద్ధి ప్రణాళికల్లో నోబెల్ గ్రహీత వంటి అంతర్జాతీయ నిపుణుల భాగస్వామ్యం ఖాయమైనట్లు తెలుస్తోంది.

# తెర పైకి మళ్ళీ మంత్రివర్గ విస్తరణ!




హైదరాబాద్,తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువు తీరి ఇంచుమించుగా 18 నెలలు అంటే సంవత్సరంన్నర కావస్తోంది. ద్వితీయ వార్షికోత్సవం దగ్గర పడుతోంది.కానీ, ఇంత వరకు పూర్తి స్థాయి మంత్రివర్గం ఏర్పడ లేదు. కారాణాలు ఏమైనా, గతంలో అనేక మార్లు పెట్టిన మంత్రివర్గ విస్తరణ ముహూర్తాలు వచ్చి పోయాయే కానీ, ఏ ఒక్కటీ ముడి పడలేదు. ఎప్పటికప్పుడు, ఏదో కారణంగా మంత్రివర్గ విస్తరణ వాయిదా పడుతూ వచ్చింది. రాజగోపాల రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి వంటి కొందరు ఎమ్మెల్యేలు తమ అసంతృప్తిని, అసమ్మతిని బహిరంగంగా వ్యక్తపరిచిన సందర్భాలు కూడా లేక పోలేదు.అయినా, మంత్రి వర్గ విస్తరణ ముహూర్తం మాత్రం రాలేదు. అయితే, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్,మరోమారు మంత్రివర్గ విస్తరణ అంశం తెర మీదకు తెచ్చారు. ఈసారి ఖచ్చితమైన ముహూర్తాన్ని అయితే ప్రకటించలేదుకానీ, శనివారం (మే 17) నిజామాబాద్'లో జరిపిన మీడియా ముచ్చట్ల సందర్భంగా ఈ నెలాఖరు లేదా జూన్ మొదటి వారంలో మంత్రి వర్గ విస్తరణ జరిగే అవకాశం ఉందని, అన్నారు.అదే సమయంలో, మంత్రివర్గ విస్తరణతో పోటీపడుతూ వస్తున్న ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీసీపీ) కార్యవర్గం సైతం ఖరారు అవుతుందని పీసీసీ చీఫ్, పదవులు ఆశిస్తున్న కాంగ్రెస్ నాయకులకు తీపి కబురు చెప్పారు. అయితే, నిజంగా ఇది తీపి కబురేనా, ఈసారైనా ముహూర్తం ముడిపడుతుందా అంటే, కాంగ్రెస్ వర్గాలు అనుమానమే అంటున్నాయి. నిజానికి, ఇటీవల కాలంలో కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విబేధాలు బహిర్గతం అవుతున్నాయి. అనేక జిల్లాల్లో విబేధాలు కొట్లాటలు, కుమ్ములాటల వరకువరకు వెళుతున్నాయి. ఫలితంగా అసమ్మతి, అసంతృప్తి బజారు ఎక్కడం, చివరకు గాంధీ భవన్ ను తాకడంతో పీసీసీ చీఫ్ వ్యూహాత్మకంగా మంత్రివర్గ విస్తరణ,మ, పీసీసీ ఖరారు అంశాలను తెర పైకి తెచ్చారని పార్టీ నాయకులు అనుమానిస్తున్నారు. ముఖ్యంగా.. మహిళలకు పదవులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావు ఇటీవల ఏకంగా గాంధీ భవన్ లో పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ చాంబర్ ముందు ఆందోళన చేపట్టారు. నిజానికి డైరెక్ట్‌గా పీసీసీ చీఫ్ పైనే ఆమె ఆరోపణలు ఎక్కు పెట్టారు. నమ్ముకున్న వారిని నట్టేట ముంచుతున్నారని పీసీసీ అధ్యక్షుడిపైనే ఆరోపణలు చేశారు. పదవుల కోసం ఇంకెన్నాళ్లు వేచి చూడాలని, తన అనుచరులతో కలిసి ఆందోళనకు దిగడంతో పాటుగా, మహేష్ కుమార్ గౌడ్ సొంతానికి పదవులు ఇచ్చుకుంటున్నారని ఆరోపించారు. నిజానికి.. బయట పడక పోయినా కాంగ్రెస్ పార్టీలో పదవులు ఆశిస్తున్న చాలా మంది ఇదే అభిప్రాయంతో ఉన్నారని అంటున్నారు. అందుకే.. నాయకుల అసంతృప్తిని పసిగట్టినమహేష్ కుమార్ గౌడ్ దిద్దుబాటు చర్యల్లో భాగంగా.. త్వరలోనే పీసీసీ పదవులతో పాటుగా మంత్రివర్గ విస్తరణ కూడా ఉంటుందని ప్రకటించి ఉంటారని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. నిజానికి.. మంత్రివర్గ విస్తరణ జరిగేదే ఉంటే.. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నడుమ, అధిష్టానం ఫిక్స్ చేసినట్లు ప్రచారం జరిగిన, సంక్రాంతి (ఏప్రిల్ 3) ముహుర్తానికే విస్తరణ జరిగేదని, అంటున్నారు. నిజానికి అప్పట్లో ముహూర్తం ఖరారు కావడమే కాకుండా.. మంత్రి పదవులు పొందే ఎమ్మెల్యేల పేర్లు కూడా ఖరారు అయినట్లు ప్రచారం జరిగింది. అయితే, సంక్రాంతి ముహూర్తం వచ్చింది. వెళ్ళింది. కానీ.. మంత్రివర్గ విస్తరణ జరిగలేదని కాంగ్రెస్ నాయకులే గుర్తు చేస్తున్నారు.అలాగే.. ఉగాదికి మంత్రివర్గ విస్తరణ చేస్తామని తాము ఎక్కడ చెప్పలేదని,మంత్రివర్గ విస్తరణ ఏఐసీసీ పరిధిలో ఉన్న అంశం కాబట్టి ఏఐసీసీ నిర్ణయించే వరకు ఎవరు ఎన్ని ముహూర్తాలు పెట్టినా, అవి మురిగి పోతాయని అప్పట్లో మహేష్ కుమార్ గౌడ్ చెప్పిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. మంత్రి వర్గ విస్తరణ ఢిల్లీ పెద్దలు ఎప్పుడు నిర్ణయం తీసుకుంటారో అప్పుడే జరుగుతుంది. అంతవరకు ముఖ్యమంత్రి, పీసీసీ చీఫ్ సహా ఎవరు ఏమి చెప్పినా.. ఎన్ని ముహూర్తాలు పెట్టినా, సంపూర్ణంగా విశ్వసించ లేమని అంటున్నారు.

# అడవిదొంగలపై కఠిన చర్యలేవీ? పోడుతో కోట్లాది వృక్ష సంపద ఖతం



ఆదిలాబాద్,ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి ప్రతి రోజు లక్షలాది రూపాయల విలువ చేసే టేకు కలప అక్రమంగా తరలిపోతుంది. ఆదిలాబాద్ టేకు కలపకు ఇతర ప్రాంతాల్లో మంచి డిమాండ్ ఉండడంతో స్మగ్లర్లకు కాసుల వర్షం కురిపిస్తోంది. కోట్లాది రూపాయల కలప అ క్రమంగా తరలిపోతుంటే లక్షలాది రూ పాయల అక్రమ కలపను అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకుంటున్నారు. కవ్వాల్ అభయారణ్యంతోపాటు జిల్లాలోని ఇతర అటవీ ప్రాంతాల నుంచి టేకుతోపాటు ఇసుక, రాయి, మొరం అక్రమంగా తరలిస్తున్నారు. ఈ విషయం అంతా కింది స్థాయి నుంచి ఉన్నతాధి కారుల వరకు తెలిసినప్పటికీ మామూళ్లు తీసుకుని మౌనంగా ఉంటున్నారనే ఆరోపణలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. అటవీశాఖ చెక్‌పోస్టుల్లోని సిబ్బంది అడవుల నుంచి అక్రమ కలప, ఇసుక, రాయి, వన్యప్రాణుల మాంసాన్ని తరలించకుండా చర్యలు తీసుకోవాల్సి ఉండగా వాటిని ఆ వాహనాల నుంచి డబ్బులు తీసుకుని వదిలి పెట్టడంతోపాటు ఇతర వాహనాల నుంచి కూడా ఎంతో కొంత ముక్కుపిండి మరీ వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జింక, దుప్పులు, అడవి పంది తదితర వన్యప్రాణులను వేటగాళ్లు హతమార్చి మాంసాన్ని కరీంనగర్, వరంగల్, హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. జిల్లాలో కలప స్మగ్లర్లు, వన్యప్రాణుల వేటగాళ్లు ఎవరూ, వారు ఎక్కడికి సరఫరా చేస్తున్నారనే విషయాలు అటవీశాఖ అధికారులకు తెలిసినప్పటికీ వారు ఇచ్చే కాసులకు కక్కుర్తి పడి పట్టించుకోడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అటవీ ప్రాంతంలోని 2 వందల ఎకరాల్లోని కోట్లాది రూపాయల విలువ చేసే టేకు వృక్షాలను గిరిజ నులు పోడు వ్యవసాయం పేరిట నరికివేశారు. వందలాది ఎకరాల్లోని వేలాది టేకు వృక్షాలను నరికి అక్రమంగా కలపను ఇతర ప్రాంతాలకు ఇప్పటికే తరలిం చుకు పోయారు. అటవీ సంపద నాశనం కావడానికి కారకులైన ఆ శాఖ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. అడవుల జిల్లా ఆదిలాబాద్‌ను అందిన కాడికి దోచుకుంటున్నారు. ఇప్పటికే స్మగ్లర్లు అడవులను పూర్తిగా ధ్వంసం చేశారు. వన్యప్రాణుల ను ఇష్టం వచ్చినట్లుగా వేటాడారు. ఆదిలాబాద్ జిల్లా అంటే దట్టమైన దండకారణ్యంతో ఒకప్పుడు అడవుల జిల్లాగా పేరు ఉండేది. ఆకాశాన్ని ముద్దాడే టేకు వృక్షాలతో కనుచూపు మేర పచ్చని చెట్లతో, పక్షుల కిలకిలరావాల, చెంగుచెంగున ఎగిరే జింకలతో అహ్లాదకరంగా ఉండేది. స్మగ్లర్ల, వేటగాళ్ల ధనదాహానికి అటవీశాఖ అధికారుల అవినీతి, అక్రమాలు తోడవడంతో అడవి తల్లి నేలకొరగగా, వన్యప్రాణులు అంతరించిపోయే దుర్భర పరిస్థితి దాపురించింది. రిజర్వు ఫారెస్టులో చెరువుల నిర్మాణాలు చేపట్టరాదనే నిబంధనలు ఉన్నప్పటికీ పెంబి రిజర్వు ఫారెస్టులో చెరువులను నిర్మించారు. జిల్లా విస్తీర్ణంలో ఒకప్పుడు 40 శాతం ఉన్న అడవి ఇప్పుడు చాల తక్కువ శాతంలో ఉంది. అడవిని, కవ్వాల్ అభయారణ్యం నుంచి చిన్న కర్ర కూడా బయటకు వెళ్లకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. గతంతో పోలిస్తే భద్రతను కట్టుదిట్టం చేశామన్నారు. ఎలాంటి అక్రమాలకు పాల్పడ్డా కఠినంగా వ్యవహరిస్తున్నామని చెప్పారు.

# తెలుగు రాష్ట్రాల్లో జూన్ 1 నుంచి సినిమా థియేటర్లు బంద్..



హైదరాబాద్,తెలుగు రాష్ట్రాల్లో సినీ ఎగ్జిబిటర్లు కీలక నిర్ణయం తీసుకున్నారు. జూన్ 1 నుంచి సినిమా థియేటర్లు బంద్ చేయాలని నిర్ణయించారు. తెలుగు ఫిల్మ్ ఛాంబర్ లో తెలంగాణ, ఆంధ్రా ఎగ్జిబిటర్ల సంయుక్త సమావేశం జరిగింది.నిర్మాతలు దిల్ రాజు, సురేశ్ బాబు సహా 60 మంది ఎగ్జిబిటర్లు హాజరయ్యారు. అద్దె ప్రాతిపాదికన సినిమాలను ప్రదర్శించలేమని ఎగ్జిబిటర్లు తేల్చిచెప్పారు. పర్సంటెజీ రూపంలో చెల్లిస్తేనే సినిమాలను ప్రదర్శిస్తామని నిర్మాతలకు లేఖ రాయాలని ఎగ్జిబిటర్ల తీర్మానం చేశారు.కాగా, ఇప్పటికే చాలా మంది ప్రేక్షకులు సినిమా థియేటర్లకు వెళ్లడం లేదు. ఇంట్లోనే ఓటీటీల ద్వారా సినిమాలు చూస్తున్నారు. థియేటర్లకు వెళ్లే ప్రేక్షకులు తగ్గిపోతున్నారంటూ సినీ రంగానికి చెందిన వారు బహిరంగంగానే చాలాసార్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు జూన్ 1 నుంచి సినిమా థియేటర్లు బంద్ చేయాలని నిర్ణయం తీసుకోవడంతో మరిన్ని కష్టాలు ఎదురయ్యే అవకాశం ఉంది.

ఈ సినిమాలపై ప్రభావం

తెలుగు రాష్ట్రాల్లో జూన్ 1 నుంచి థియేటర్లు బంద్ చేయాలని ఎగ్జిబిటర్లు నిర్ణయం తీసుకోవడంతో పలు సినిమాలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉంది. మే 30న భైరవం, జూన్ 5 థగ్ లైఫ్, జూన్ 12న హరిహర వీరమల్లు, జూన్ 27న కన్నప్ప, జూన్ 20న కుబేర్, జులైలో కింగ్ డమ్ విడుదల కావాల్సి ఉంది. దీంతో వీటిపై ప్రభావం పడుతుంది.

ఇప్పటికే నష్టాల్లో..

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో సింగిల్ స్క్రీన్ థియేటర్లు ఇప్పటికే నష్టాల్లో ఉన్నాయి. హిట్ సినిమాలు సింగిల్ స్క్రీన్ థియేటర్లలో ఆడుతున్న వేళ మాత్రమే ఆ సినిమా హాళ్లకు కాస్తయినా లాభం వస్తుంది. ఫ్లాప్ సినిమాలు ఆడుతుంటే సింగిల్ స్క్రీన్ థియేటర్లవైపు ప్రేక్షకులు కన్నెత్తి కూడా చూడడం లేదు. ఇప్పటికే ప్రేక్షకుల సంఖ్య తక్కువగా ఉండడంతో సింగిల్ స్క్రీన్ థియేటర్లు అనేక షోలను రద్దు చేసుకుంటున్నాయి.ప్రస్తుత పరిస్థితుల్లో సింగిల్ స్క్రీన్ థియేటర్లకు లాభాలు వచ్చే చర్యలు తీసుకోకపోతే ఇక అవి శాశ్వతంగా మూతపడతాయన్న ఆందోళన నెలకొంది. ఈ నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల్లో సినీ ఎగ్జిబిటర్లు జూన్ 1 నుంచి సింగిల్ స్క్రీన్ సినిమా థియేటర్లు బంద్ చేయాలని నిర్ణయించారు. తెలుగు ఫిల్మ్ ఛాంబర్‌లో జరిగిన తెలంగాణ, ఆంధ్రా ఎగ్జిబిటర్ల సంయుక్త సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. అద్దె ప్రాతిపాదికన సినిమాలను ప్రదర్శించలేమని ఎగ్జిబిటర్లు స్పష్టం చేశారు. పర్సంటెజీ రూపంలో చెల్లిస్తేనే సినిమాలను ప్రదర్శిస్తామని నిర్మాతలకు లేఖ రాయాలని తీర్మానం చేశారు.ఒకప్పుడు సినిమా చూడాలంటే సింగిల్ స్క్రీన్ థియేటర్లే దిక్కు. ఈ థియేటర్లు తెలుగు సినిమా ఎదిగిన తీరుకి సాక్ష్యాలుగా నిలిచాయి. మెరుగైన సౌకర్యాలు, సౌండ్ టెక్నాలజీతో వచ్చిన మల్టీప్లెక్స్ సంఖ్య పెరగడంతో ఇప్పుడు సింగిల్ స్క్రీన్ థియేటర్లు ఆదాయం తగ్గిపోయి, నిర్వహణ పరంగా ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటున్నాయి.తెలుగు రాష్ట్రాల్లో ఎన్ని సింగిల్ స్క్రీన్ థియేటర్లు ఉన్నాయన్న వివరాలు అంతగా స్పష్టంగా లేవు. తెలంగాణలో 450 సింగిల్ స్క్రీన్ థియేటర్లు ఉన్నాయని కొన్ని నివేదికలు చెబుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో 1,600 సింగిల్ స్క్రీన్ థియేటర్లు ఉన్నట్లు అంచనా. అయితే, ఆంధ్రప్రదేశ్‌లో 2,809 సింగిల్ స్క్రీన్లు ఉన్నాయని ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పేర్కొంది. ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లోని ఎన్నో సింగిల్ స్క్రీన్ థియేటర్లు ఫంక్షన్ హాల్స్‌గా మారిపోయాయి.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com